
# మిసిమి

మాస పత్రిక

ఆగష్టు-2004



రూ. 8/-



చిత్రకారుడు : మిలేస్ (1829 - 1896)

(వివరాలు 291వ పేజీలో)



సాయంకాలపు తేనీటి విందు

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 15 | ఆగస్టు 2004 | సంచిక 8

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయ సూచిక


చిత్రకళలో అలజడి రేపిన మిలేస్- అతని మిత్ర బృందం — కాండ్రేగుల నాగేశ్వరరావు

హెన్రి సెంకివిక్ — మూలం : సి.డి. ఆఫ్ విర్సెన్
అనువాదం: బి.వి.రామిరెడ్డి

సీమారహిత సైకత కాసారం — అశ్వినీ కుమార్

సుఖ జీవనానికి మార్గాలు — సి.వి. సర్వేశ్వర శర్మ

ఆయుర్వేద కామశాస్త్రాలపై తంత్రశాస్త్ర ప్రభావం — భాగవతము రామారావు

ఇతిహాసాల్లో వృత్తి కులాలు — మూలం: అశోక్ కుమార్ మజుందార్
అనువాదం : శివలింగం

సమసమాజంలో మానవాత్మ — మూలం : ఆస్కార్ వైల్డ్
అనువాదం : సర్దేశాయి తిరుమల రావు



విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **అంధురాలు**

చిత్రకారుడు : **మిలేస్**

Printed & Published by **Bapanna Alapati** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# QUIZ ??

1. Who was the first non-human to win an Oscar? (D Anuradha, Hyderabad.)
2. About 192 kmph is the highest speed reached by the human body in which non-mechanical sport? (Ritesh Mintri, Darjeeling).
3. Which motor car manufacturer's slogan, when translated into English, is "Forward through technology"? (Tapas Kumar Mitra, Malda.)
4. Which England Test cricketer became the Governor of Bombay and served as Under Secretary of State for India and Under Secretary of State for War in the administration of the Marquis of Salisbury? (Sweta Verma, Kolkata).
5. The famous headline "Underarm is Underhand" is associated with which sporting incident ? (Naresh Nath Mukherjee, Kolkata.)
6. During World War II, the British Broadcasting Corporation always played the first few notes of Beethoven's Fifth Symphony before the news began. What was the reason for this? (Abhishek Borah, New Delhi).
7. The greatest destroyer of peace is abortion because if a mother can kill her own child, what is left for me to kill you and you to kill me?" These are the words of a famous Nobel Laureate. Who? (Santanu Ganguly, Kolkata.)
8. The sets of which Oscar nominated film were made in Hyderabad? (D Ravindranath, Secunderabad.)
9. What is common to the following people: John Denver, Rocky Marciano, Sanjay Gandhi, Yuri Gagarin and Amelia Earhart? (Kalikinkar Sengupta, Kolkata.)
10. "First, they killed Diana, now they are after me." Which chief minister said this recently? The quote is translated into English. (Santanu Acih, Kolkata).

---

*Answers :*

1. Mickey Mouse. 2. Sky-diving – free-falling. 3. Audi 4. Lord Harris.

5. Twenty years ago, Australian cricket captain Greg Chappell instructed his brother Trevor to bowl underarm during a match to prevent a New Zealand player from hitting a six. New Zealand needed six runs to tie the game. After strong protests, underarm bowling was abolished thereafter.

6. The first few notes of Beethoven's *Fifth Symphony*, when translated into the Morse code, would stand for the sign "V" which signified "Victory" for the Allied forces.

7. Mother Teresa. 8. *Gladiator* 9. They all died in plane crashes.

10. Rabri Devi, chief minister of Bihar.

*(Courtesy By The Stateman)*

**వివరణ :**

జులై మిసిమిలో 'గుయెర్నికా విజయం' రచయిత పాల్‌లార్డ్‌ను స్పానిష్ రచయితగా మాత్రమే చెప్పడం జరిగింది. అతడు వాస్తవానికి ఆ పద్యాన్ని స్పానిష్ భాషలోనే రాశాడు. అతడు ఉభయ భాషాకవి. ఫ్రెంచిలోను రాస్తాడు. ప్రపంచం అతనిని ఫ్రెంచి రచయితగా గుర్తించింది. ఈ విషయాన్ని మిసిమిలో విస్మరించడం జరిగింది. ఈ విస్మరణను చలసాని ప్రసాద్, విశాఖపట్నం, ఎత్తి చూపారు. వారికి కృతజ్ఞతలు.

# చిత్రకళలో అలజడి రేపిన మిలేస్-అతని మిత్ర బృందం

- కాంద్రేగుల నాగేశ్వరరావు

ఇంగ్లండ్‌లోని సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ అనే సంస్థ నిర్వహించిన చిత్రకళా పోటీలో బహుమతి ప్రదానం చేయడానికి ఎసెక్స్ యువరాజును ఆహ్వానించారు. ఉత్తమ బహుమతి గ్రహీతగా 'మిలేస్' పేరును ప్రకటించినపుడు ప్రేక్షకుల కరతాళాల మధ్య తొమ్మిది సంవత్సరాల వయస్సు గల ఒక బాలుడు వచ్చి బహుమతి అందుకున్నాడు. అతని పేరే మిలేస్. 1829వ సంవత్సరంలో జెర్సీ నగరంలో ప్రాచీన యుద్ధ వీరులైన నార్మన్ జాతికి చెందిన జమిందారీ కుటుంబంలో జన్మించాడు. 1835వ సంవత్సరంలో ఆరు సంవత్సరాల వయస్సున్నపుడు తాను పెరుగుతున్న పల్లె, అందులోని మనుష్యులను పెన్సిల్‌తో కాగితంపై గీసేవాడు. మొదట్లో పెద్దగా పట్టించుకోకపోయినా కొడుకులో వున్న ఆసక్తిని గమనించిన తండ్రి అతను గీసిన చిత్రాలను ఇంగ్లండ్‌లోని రాయల్ అకాడమీ అధ్యక్షుడైన, శ్రీ మార్టిన్‌కు చూపించి అభిప్రాయ మడిగాడు. చిత్రాలను పరిశీలించిన మార్టిన్ ఈ కుఱ్ఱవానికి చిత్రకారునిగా మంచి భవిష్యత్ ఉందని ఊహించాడు. ఆ బాలుని ఇంగ్లండ్‌లోని బ్లూమ్స్ బెరీ (Blooms Berry) అనే శిక్షణా సంస్థలో ప్రవేశపెట్టి ప్రోత్సహించాడు. ఆ బాలుడు చిరు ప్రాయంలోనే బ్రిటీష్ మ్యూజియమ్‌కు వెళ్ళి అక్కడున్న కళాకృతులకు నకలు చేసుకొనేవాడు. రెండు సంవత్సరాలు గడచిన తరువాత రాయల్ అకాడమీలో ప్రవేశం లభించింది. అప్పటి నుంచి ఆ చదువు పూర్తయే ఆరుసంవత్సరాల కాలంలో అకాడమీ నిర్వహించే వార్షిక చిత్రకళ పోటీల్లో ఎప్పుడూ అతనిదే ప్రథమస్థానం. విద్యార్థి దశలో అతనికి లభించని బహుమతంటూ లేదు. తన 18వ యేట బంగారు పతకంతో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు. యౌవనపు తొలి ప్రాంగణంలోనికి అడుగు పెట్టక మునుపే అతను ఇంగ్లండులో అత్యంత జనాదరణ పొందిన చిత్రకారునిగా పేరొందాడు. 1847వ సంవత్సరంలో వెస్ట్‌మినిస్టర్ హాలు నిర్వహించిన పోటీలో The Widow Bestowing Her Mite అనే చిత్రం ఎన్నికయింది. ఇందులో మనుష్యల చిత్రాలను వారి పరిమాణంలో చిత్రించి అతను వయస్సుకు మించిన పరిణతి చూపాడు. నిజ జీవితంలో, కళా జీవన ప్రయాణంలో ఏ మాత్రం ఒడుదుడుకులు లేకుండా జీవితాంతం పేరు ప్రఖ్యాతలు, లక్ష్మీ కటాక్షం పొందిన అతి కొద్దిమంది చిత్రకారులలో అతనొకడు. అతని జనాదరణకు అతని సుందరమైన రూపు ఒక కారణమనే విమర్శకుల అపప్రథ కూడా ఆరోజులలో ఉండేది.

అంతా సవ్యంగా జరుగుతున్నపుడు 1848 ప్రాంతంలో అతను తన యీడువారు, సహాధ్యాయులైన మిత్రులు డాంటే గేబ్రియల్ రొసెట్టే, విలియమ్ హోల్మన్ హంటే అనే మిత్రులను కలుపుకొని 'ప్రీ రాఫెలైట్ బ్రదర్‌హుడ్', (Pre-Raphaelite Brotherhood) అనే సంస్థను స్థాపించి చిత్రకళలో అలజడి రేపాడు.

ప్రపంచ చిత్రకళా చరిత్రలో పునర్వికాస దశ (Renissance period) ఒక సువర్ణాధ్యాయం. ఆ యుగానికి చెందిన త్రిమూర్తులైన డావించీ, మైఖేలాంజిలో, రాఫెల్ పట్ల చిత్రకళా ప్రపంచంలో

---

కాంద్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్స్ అడిషనల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. కళ, సాహిత్యాలు అభిమాన విషయాలు.

విపరీతమైన ఆరాధనా భావం ఆనాటి నుంచి ఈనాటి వరకూ ఉంది. రాఫెల్ శైలి మిగిలిన ఇద్దరికంటే ఉత్కృష్టమైనదిగా భావించేవారు.

పునర్వికాస దశకు ముందున్న గ్రీకు, రోమన్ చిత్రకళా రీతులు గొప్పవనీ, వాటిలో సూక్ష్మాతి సూక్ష్మమైన ప్రకృతి చిత్రీకరణ వుందనీ దానిని రాఫెల్ తప్పుదోవ పట్టించాడని, నిజానికి చిత్రకళలో అత్యున్నతమైన దశ రాఫెల్‌కు ముందేవుందని, ఆ ఉత్కృష్టమైన నైపుణ్యాన్ని లాలిత్యం పేరుతో రాఫెల్ పక్కకు నెట్టి వేశాడని ఇది సరైన విధానం కాదనీ ఈ మిత్రత్రయం అభిప్రాయపడింది. రాఫెల్‌కు ముందు యుగపు ఇటాలియన్ చిత్రకారులనే వీరు మార్గ దర్శకులుగా తీసుకున్నారు. ఆ శైలిలో చిత్రాలు వేసిన పోర్డ్ మార్డాక్స్ బ్రౌన్ (Ford Mardox Brown) అనే చిత్రకారుని చిత్రరచనా పద్ధతులనే వీళ్ళు ఆదర్శంగా అనుసరించారు. ''ప్రీ రాఫెలైట్ బ్రదర్‌హుడ్'' అనే సంస్థను స్థాపించి, పై అభిప్రాయాలను వెల్లడించేనాటికి వీళ్ళ వయస్సు 20, 23 సంవత్సరాల మధ్యనే వుంది. ఆనాటి సమకాలీన చిత్రకళా ప్రపంచం, దాని ఆరాధకులు, విమర్శకులు దీనిని బాల్య చేష్టగా భావించి పట్టించుకోలేదు. సరియైన మానసిక పరిణతి లేక పోవటము వలననే వీళ్లు ఇదంతా చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. ప్రజలలో సరైన స్పందన లభించక పోవటం వలన ఈ మిత్ర బృందం నిరుత్సాహ పడక 'అంకురం' అనే పేరుతో నాలుగు నెలల పాటు ఒక పత్రికను నడిపి సోదాహరణంగా తమ అభిప్రాయాలను ధృవపరచుకొనే ప్రయత్నాలు సాగించారు.

ఊహించని ఈ అలజడితో ఇంగ్లడులోని చిత్రకళా ప్రపంచం ఒక్కసారి నివ్వెర బోయింది. రాఫెల్‌ను విమర్శించటంతో అనేకమంది కళాభిమానుల మనోభావాలు దెబ్బతిన్నాయి. వీళ్ళ అభిప్రాయాలను నిరసిస్తూ వ్యాసాలు వెలువడ్డాయి. ప్రఖ్యాత రచయిత చార్లస్ డికెన్స్ వీళ్ళపై నిప్పులు చెరిగాడు. వీళ్ళ అభిప్రాయాలను నిర్వంధంగా ఖండించాడు. ఆనాటి రసిక జనం డికెన్స్ వాదనతో ఏకీభవించారు. చివరకు ఈ మిత్ర త్రయం చాల పెద్ద యెత్తున వ్యతిరేకతను ఎదుర్కొనవలసి వచ్చింది. అది ఎంతవరకు వెళ్ళిందంటే వీళ్ళ చిత్రాలను చిత్ర ప్రదర్శన శాలలనుండి తొలగించవలిసినదిగా రాయల్ అకాడమీపై ఒత్తిడి పెరిగింది. ఈ ముగ్గురు చిత్రకళా జీవితానికి చరమాంకం పాడవలసిన సమయంలో ''నేనున్నాను'' అంటూ దేవ దూతలా వచ్చిపడ్డాడు సామాజకునిగా, చిత్రకళా విమర్శకునిగా పేరుగాంచిన రస్కిన్. అప్పటికే ఆధునిక చిత్రకారులనే విశ్లేషణా గ్రంథాన్ని అతను ప్రచురించి వున్నాడు. ప్రీ రాఫెల్ మిత్ర బృందాన్ని అక్కున జేర్చుకొని వీళ్లను సానుభూతితో కాక అర్థవంతంగా పరిశీలించి నిర్ధారణకు రావలసినదిగా తన రచనల ద్వారా రసజ్ఞాలను కోరాడు. రస్కిన్ వ్యాసాలతో ప్రజాభిప్రాయంలో క్రమేపీ మార్పు వచ్చి సానుకూల పరిస్థితులు ఏర్పడినా మిత్రత్రయం అభిప్రాయాలను మాత్రం ప్రజలు ఆసాంతం అంగీకరించక లేక పోయారు. అయితే విచిత్రమైన విషయమేమిటంటే ఇంత తీవ్ర విమర్శల మధ్య కూడా మిలేస్ యొక్క చిత్రాలకు ప్రజాదరణ తగ్గక పోవటం.

విమర్శలు తారాస్థాయి చేరిన, ఆసమయంలోనే అతని ప్రతిభకు దర్పణంగా రాయల్ అకాడమీవారు మిలేస్‌కు అకాడమీ సభ్యత్వాన్నిచ్చేరు. ఇంతవరకూ ఆ పదవికి ఎన్నుకొనబడిన వారిలో మిలేస్ పిన్న

వయస్కుడు. అయితే వయో నిబంధనల కారణంగా అతను 25 సంవత్సరాల వయస్సు వచ్చేవరకూ సభ్యుడు కాకుండా ఆగవలసి వచ్చింది. 1953వ సంవత్సరంలో సభ్యత్వాన్ని పొందాడు.

జీవితంలో ఎన్నో మన్ననలను సొంతం చేసుకొని 1896వ సంవత్సరంలో ప్రతిష్ఠాత్మకమైన రాయల్ అకాడమీకి అధ్యక్షునిగా ఎన్నికైనాడు. అదే సంవత్సరం ఆగస్టు 16వ తేదీన కంఠంలో ఏర్పడిన పుండు కాన్సర్‌గా వృద్ధి కావటంతో మిలేస్ తనువు చాలించాడు.

మిలేస్‌పై గాని అతని మిత్రులైన హంట్, రోసట్టేల ప్రతిభా విన్యాసలపై ఆనాటి కళాజీవులకు ఏ విధమైన చిన్నచూపులేదు. పైపెచ్చు బోలెడంత గౌరవం కూడా వుంది. కానీ రాఫెల్‌కు ముందున్నదే చిత్రకళా స్వర్ణయుగమన్న భావనను మాత్రం వాళ్లు జీర్ణించుకోలేక పోయారు. మిలేస్ బాటలోనే మరింత మంది ప్రయాణం సాగించినా ప్రీ రాఫెలిజం అనే భావన తగిన ఫలితాన్ని పొంద లేకపోయింది.

ప్రఖ్యాత ఆంధ్ర చిత్రకారుడైన దామెర్ల రామారావు ప్రీ రాఫెలిజం శైలి నుంచి ఉత్తేజం పొందినవాడే. అతని చిత్రాలలో ఈ ధోరణి కనిపిస్తుంది.

మిలేస్ వేసిన అనేక చిత్రాలలో చాలా వరకూ బైబిల్, షేక్స్‌పియర్ మరియు ఇతర క్లాసికల్‌కు సంబంధించిన దృశ్యాలు ఉంటాయి. ఉత్తమ సాహిత్యంలోని ఉదాత్తపాత్రలకు, సంఘటనలకు అతను దృశ్యరూపమిచ్చి వాటికి చిరంజీవత్వం ప్రసాదించాడు.

**మిలేస్ కొన్ని ప్రముఖ చిత్రాలు :**

**అంధురాలు :** చూడగానే మనస్సును కరిగించే అద్భుతమైన కరుణ రసాత్మక చిత్రమిది. ప్రకృతి తన సహజ అందాలను విర బూసినపుడు దానిని చూడడానికి నోచుకోని ఒక అంధురాలు దీనిలో చిత్రించబడింది. ఇంద్రధనస్సుకు పెడముఖంగా రసహీనంగా నిస్తేజంగా అంధురాలు కూర్చొని వుంటే, ఆమె ఒడిలో ఉన్న బాలిక ఇంద్రధనస్సును విభ్రమాశ్చర్యాలతో చూస్తూ వుంటుంది. దీని రచనా కాలం 1855. అతనికి పేరు తెచ్చిన చిత్రాల్లో ఇది ముఖ్యమైనది. కళ్ళు లేనివారిలో మిగిలిన ఇంద్రియాలు వృద్ధి చెంది కొంత వరకు ఆ కొరతను తీరుస్తుందన్నదానికి నిదర్శనంగా ఆమె తన చేతితో సున్నితంగా గడ్డి మొలకలను పట్టుకోవటం, ఆమె ఒడిలో ఒక సంగీత పరికరం ఉండడం గుర్తించాలి. (ఈ సంచిక మొదటి అట్టపై చిత్రం)

**సంధ్యాసమయంలో తేనీరు సేవనం (1899) :** ఈ ఆహ్లాదకర దృశ్యాన్ని మిలేస్ మొదట్లో 'ఉబుసు పోని కబుర్లు' అని పిలచాడు. మధ్య కూర్చున్న బాల అల్పమధుర పృష్టభాగాన్ని చూచి పెయింట్‌చేయకుండా ఉండలేక చిత్రించానని చెప్పుకున్నాడు. (రెండవ అట్టపై చిత్రం)

**ఒఫీలియా (1852) :** షేక్స్‌పియర్ విరచితమైన హామ్లెట్ నాటకంలో నాయకుడైన హామ్లెట్‌ను గాఢంగా ప్రేమించి, అతనిచే ప్రేమించబడి, అతను రాజకీయపరంగా నటిస్తున్న పిచ్చితనము నిజమని నమ్మి భరించరాని హృదయ వేదనతో ఆత్మహత్య చేసుకొన్న ముగ్ధమనోహరి. మృత్యువుకే అందాలను అద్దినట్లుగా చిత్రించబడిన ఈ చిత్రంలో మరణించిన ఒఫీలియా ముఖంలో జీవన సౌందర్యం వుట్టి పడుతుంది. నిర్మలమైన సౌందర్యమంటే ఇదేనేమో అనేటట్లుగా చేసిన ఈ చిత్రీకరణ బహుళ

ప్రజామోదం పొందింది. ఈ చిత్రానికి మిలేస్ తన మిత్రుడు రొసెట్టే ప్రియురాలైన ఎలిజబెత్ సిడాల్‌ను మోడల్‌గా తీసుకొని, ఆమె తొట్టిలో స్నానం చేస్తుండగా స్కెచ్ వేసుకొని, తరువాత ముర్రే ప్రాంతంలో తేమ్స్‌నదికి అనుబంధంగా నున్న ఒకసెలయేరుని, దాని చుట్టూవున్న లతలను చిత్తు ప్రతులుగా వేసుకొని తరువాత వీటన్నింటినీ అనుసంధానం గావించాడు. ఈ చిత్రం గీయడానికి చాలా ఎక్కువ సమయం తీసుకున్నాడు. సెలయేటిని ఆనుకొని వున్న లతలను చిత్రించడానికే సుమారు నాలుగు నెలల సమయం తీసుకున్నాడు. కొద్దిపాటినేపథ్యం తేడాతో రెండు చిత్రాలను గీశాడు. వేరువేరు కాలాల్లో పూచేపువ్వులను ఒక్కచోట జేర్చి ఆ పూలను ఆమె శరీరంపై కప్పివుంచాడు. ఒకొక్క పుష్పం ఒకొక్క భావానికి ప్రతీకగా వాడబడింది. పాపీ (మృత్యువు), డైసీ (అమాయకత్వం), గులాబీ (యౌవ్వనం), వయొలెట్ (ప్రేమ, అకాల మృత్యువు), పాన్సీ (భగ్నమైన ప్రేమ). (ఈ సంచిక మూడవ అట్టపై చిత్రం)

విడుదల (1846) : ఈ చిత్రంలో ముఖ్యపాత్రదారి ధృడమైన చిత్తంతో, ఆత్మ విశ్వాసంతో మనోస్థైర్యంతో తీక్షణమైన చూపులతో వెలిగిపోతున్న ఒక స్త్రీమూర్తి. ఆమె తీసుకొని వచ్చిన విడుదల పత్రాన్ని పరిశీలించి నిర్బంధంలోనున్న ఆమె భర్తను జైలు నుంచి విడుదల చేస్తున్న జైలర్. తన అసహాయతనూ, ఓటమినీ భరిస్తూ తీవ్రమైన మానసిక వ్యధతో కృతజ్ఞతా భావంతో ఆమెపై ఒరిగి దుఃఖాన్ని ఉపసమనం చేసుకుంటున్న ఆమె భర్త. విడుదలైన తన యజమాని కోసం తహతహ లాడుతున్న కుక్క, ఇదేమీ పట్టకుండా చేతిలో గిలిగింజకాయ పట్టుకొని ఆదమరచి నిద్రిస్తున్న పసిపిల్లవాడు. ఈ చిత్రం ఆద్యాంతం ఒక కాల్పనిక నాటకీయతతో కూడుకున్న సన్నివేశం మన కళ్ళకు కడుతుంది. సుఖాంత మైన ఒక విషాద సన్నివేశమిది. చిమ్మ చీకటిలో ప్రకాశవంతమైన దుస్తులు ధరించినపాత్రలు (ఇది ప్రీ రాఫెలిజం ముఖ్య లక్షణం) మనల్ని చూపు మరల్చుకోనివ్వవు. ఈ చిత్రం రాయల్ అకాడమీలో ప్రదర్శించినపుడు చూడడానికి వచ్చిన సందర్శకులు నిశ్చేష్టులై నిలబడిపోయేవారు. వారిని కదిలించి క్యూను కదపడానికి ప్రత్యేకంగా పోలీసు సాయం తీసుకోవలసి వచ్చింది. రాయల్ అకాడమీలో అతని సభ్యత్వానికి ఈ చిత్ర ప్రజాదరణ దోహదపడింది. (ఈ సంచిక నాల్గవ అట్టపై చిత్రం)

కీ॥శే॥ సంజీవదేవ్‌గారు ఒకచోట అంటారు. నేనొక మంచి చిత్రాన్ని చూశాను, ఇప్పుడు నాకొక కథ వ్రాయాలనిపించిందని. ఈ చిత్రం ఆయనలోనేకాదు మనందరిలోనూ అటువంటి భావావేశాన్నే కలగ చేస్తుంది.

పైన పేర్కొన్న చిత్రాలన్నీ ఇంగ్లండులో టేట్ గ్యాలరీ మ్యూజియమ్‌లో చూడవచ్చు.

ప్రీ రాఫెలిజంలోని ముఖ్యమైన లోపం, అవసరాన్ని మించి చిత్రించే నిర్దుష్ట వివరాలు. ఈ అతి వివరణ వల్ల చిత్రంలో ఫోకస్ దెబ్బ తింటుంది. చెప్పవలసినది, చూడవలసిన విషయాలను చిత్రం డిస్టర్బ్ చేస్తుంది. ఏ వస్తువు పైనా మనస్సును నిలువ నివ్వదు. గ్రీకు చిత్రకళలో వున్న ఈ లోపాన్నే రాఫెల్ చక్కదిద్దాడు. చిట్టచివరకు 1860 తరువాత వేసిన చిత్రాలలో మిలేస్ కూడా తన శైలిని మార్చుకొన్నాడు. ఈ విషయమై మిగిలిన చిత్రకారులలో ఒకరైన రొసెట్టే అతనితో విభేదించి విడిపోయాడు. మిత్రత్రయంలో మిగిలిన ఇద్దరూ రొసట్టే, హంట్‌లు చివర వరకూ ప్రీ రాఫెలిజం సిద్ధాంతానికి అంటి పెట్టుకునే వున్నారు. కానీ చిత్రకారునిగా మిలేస్‌కు వచ్చినంత పేరు వాళ్ళకు రాలేదు.

# హెన్రి సెంకివిక్

## (1905వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కార గ్రహీత)

మూలం : సి.డి. ఆఫ్ విర్సెన్ అనువాదం: బి.వి.రామిరెడ్డి
శాశ్వత కార్యదర్శి, స్వీడిష్ అకాడెమి.

ఎక్కడ ప్రజాసాహిత్యం గొప్పగా వర్ధిల్లుతుందో అక్కడ ప్రజల ఉనికి స్థిరంగా వుంటుంది. ఎందుచేతనంటే సాంస్కృతిక పుష్పం చవిటిపర్రలో వికసింపదు. ప్రతి దేశంలోను అపురూపమైన కొద్దిమంది స్రష్టలు, ద్రష్టలు తమదేశపు తత్త్వాన్ని తమలో మూర్తీభవింపజేసుకుంటారు. వారు ప్రపంచజాతీయతకు ప్రతీకలౌతారు. వారు ఆ ప్రజల గతకాలపు స్మృతుల్ని ప్రతిబింబంపజేసినప్పటికి, వారి భవిష్యత్తును బలోపేతం చేస్తారు. వారి సృజన శక్తి గతంలో వేళ్ళూనుకున్నప్పటికి, దాని శాఖలు విశాలంగా విస్తరించి, ఆ కాలపు మారుతాలకు తలవూపుతుంది. అలాంటి సాహిత్యానికి, మేధా సంస్కృతికి ప్రతినిధిగా నిలిచిన ప్రజాప్రతినిధికి స్వీడిష్ అకాడెమి ఈ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేయాలని నిర్ణయించింది. ఆయనే ప్రస్తుతం మనతో వున్న హెన్రి సెంకివిక్.

అతను 1846లో జన్మించాడు. అతడు యౌవనంలో రచించిన ''చార్కోల్ స్కెచెస్'' (1877) సమాజంలోని పీడితులయెడల సానుభూతని వ్యక్తీకరిస్తుంది. అతని ఇతర రచనల్లో ముఖ్యమైనవి ''జాంకో ది మ్యుజీషియన్'' (1879), ''లాటర్నిక్'' (1882), మినీ నవల ''తార్తార్ ప్రిజన్'' (1880) - అతడు భవిష్యత్తులో వ్రాయబోతున్న చారిత్రక నవలాత్రయం - ''విత్ ఫైరు అండ్ స్వోర్డ్'' (1884), ''దిడెల్యూజ్'' (1886-87), ''పాన్‌మిచైల్'' (1888-89)కి ముందు బాట. దీనిలో మొదటి నవల తార్తారుల అండతో 1648-49ల మధ్య కొసక్కులు జరిపిన తిరుగుబాటును, రెండవది ఛార్లెస్ గుస్టావ్‌కి వ్యతిరేకంగా జరిగిన పోలిష్ యుద్ధాన్ని వర్ణిస్తుంది. ఇక మూడవది పిర్కులతో జరిగిన యుద్ధంలో కమీనిక్ కోటను వీరోచితంగా కాపాడుకోవడాన్ని వర్ణిస్తుంది. దీనిలోని క్లైమాక్స్‌లో స్పొరజ్ ఆక్రమణ, ఆ సందర్భంగా జెరిలం విస్నియో విక్కిలోని అంతర్మధనం వర్ణింపబడింది. ఈ అంతర్మధనంలో ఆ ధీరుడు తన అత్యాశను జయించడం కనిపిస్తుంది. ఈ త్రయంలో రచయిత స్పొరజ్, జెస్టాచోవా, కమినిక్‌ల ఆక్రమణల్ని వర్ణిస్తాడు. ''ది డెల్యూజ్'' పాఠకుల మనసులో స్థిరంగా గుర్తుండి పోతుంది. ఇందులోని ''కమిసియ'' వెలివేయబడి, తన రాజుతోనే యుద్ధం చేయవలసి వచ్చినపుడు, ఒక కులీనురాలైన స్త్రీమీద ప్రేమవల్ల తాను పోగొట్టుకున్న ఔన్నత్యాన్ని తిరిగిపొందడమేగాక న్యాయ వ్యవస్థకు సేవచేయడంలో అద్భుతమైన చాకచక్యాన్ని, ధైర్యాన్ని ప్రదర్శిస్తాడు. సెంకివిక్ అందమైన స్త్రీపాత్రలలో ఒకటైన 'ఓమెకా' మతాభినివేశంలోను, ఆమె నిజాయితీ, దేశభక్తి ఆమెను మరపురాని పాత్రగా చేశాయి. ఈ కథలోని ప్రతినాయకుని పాత్రకూడ మరపురానిది. రాజ కుమారుడైన జానుజ్ రాడ్జివిల్ తన దేశం మీదే యుద్ధం చేయడం, తన అధికారుల గౌరవార్థం ఏర్పాటు చేసిన సభలో పోలెండును దగా చేయడంలో అధికారులను ప్రేరేపించడం వర్ణించబడింది. అతడు దేశద్రోహి అయినప్పటికి, అతని వ్యక్తిత్వంలో ఒక అందం వుంది. ఒక ఆంగ్ల విమర్శకుడు ఈ రాజకుమారుడిలోని మానసిక సంస్కృతిని, తన తిరుగుబాటు పోలెండుకు మేలుచేస్తుందని తనని తాను నమ్మించుకునేందుకు చేసే ప్రయత్నాన్ని విశ్లేషించిన తీరును మెచ్చుకున్నాడు. తన అజ్ఞానానికి బాధతో రాజకుమారుడు చనిపోతాడు. మరో ముఖ్యపాత్ర ప్రిన్స్ బోగుస్లాలో కూడా కొన్ని ఆకర్షణీయ లక్షణాలున్నాయి. అతని సాహసం, ఔన్నత్యం, ఆనంద స్వభావం మనల్ని ఆకట్టుకుంటాయి. సెంకివిక్‌కు పాత్ర చిత్రణ తెలుసు. అంతేగాక తన దేశస్థుల తప్పిదాలు కూడా తెలుసు. వాటిని అతడు నిర్దాక్షిణ్యంగా బయటపెడతాడు. ఇజ్రాయెల్‌కు చెందిన పాతకాలపు ప్రవక్తల్లాగ అతడు తన ప్రజలకు

---

బి.వి. రామిరెడ్డి, సిద్దార్థా ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

చేదుసత్యాలను చెబుతాడు. పోలిష్ ప్రజల వ్యక్తి స్వేచ్ఛ కోరికను అతడు విమర్శిస్తాడు. అది వారి శక్తిని ఎలా కృంగదీస్తుందో, వారిని తమ వ్యక్తిగత యిష్టాలను త్యాగం చేయనీయకుండా ఎలా అడ్డుపడుతుందో వివరిస్తాడు. జమీందారులు తమలో తాము కలహించుకుంటూ తమ బాధ్యతను ఎలా విస్మరిస్తున్నారో చెబుతాడు. అతడు దేశభక్తుడు. తన ప్రజలకు ధీరత్వాన్ని వివరిస్తాడు. టర్కులు, తార్తారులకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో వారి క్రైస్తవ రక్షణ ఎలా పనిచేసిందో తెలియజేస్తాడు. అతడు చరిత్రను ఆబ్జెక్టివ్‌గా చూడగల మేధావి. ఒక పోలిష్‌గా అతడు ఛార్లెస్ గుస్టావ్ పోలెండు మీద చేసినదాడిని ఒప్పుకోకూడదు. అయితే రాజు యొక్క వ్యక్తిత్వంలోని సాహసాన్ని, క్రమశిక్షణను, స్వీడిష్ సైన్యంతో అనుసంధానాన్ని చక్కగా వర్ణిస్తాడు.

ఈ నవలా త్రయంలోని ''పాన్ మిచైల్'' ను బలహీనమైన భాగంగా కొందరంటుంటారు. కాని, ఆ విమర్శను మనం అంగీకరించలేం. అందులో వొలోడిజోస్కి భార్య ఆజ్యాలో పాము, సింహాల లక్షణాలున్నాయి. ఆమేగాక అందగత్తె, ధైర్యశాలి అయిన సైనికుడి భార్య బాసియాలో ధైర్యం, మాధుర్యం, గాంభీర్యం మూర్తీభవించాయి. ఆఖరి భాగంలో బాసియా, వొలోడి జోస్కిల మధ్య వీడ్కోలు దృశ్యం, కమినిక్ కోటను టర్కులు చుట్టుముట్టి, అన్ని అవకాశాలు అంతమై, సర్వనాశనం ఖాయమని తెలిసిన క్షణాల్లో భార్యాభర్తల కలయిక, భర్త ఆమెను ఓదార్చడం, తాము గతంలో పొందిన సౌఖ్యాల్ని గుర్తుచేయడం, మృత్యువు కేవలం ఒక పరిణామం మాత్రమేనని తెలియజేయడం అద్భుతం! వొలోడిజోస్కి ఖనన దృశ్యవర్ణన, శవపేటికవద్ద బాసియా, తంబూరా వాయించే చాప్లిన్ చనిపోయిన వీరుడి సాహసాన్ని, గుణగణాలను వర్ణించడం, అతని దైవ ప్రార్థన, ఇంతలో సాబీస్కి లోపలికి రావడం, అందరి కళ్ళు అటుతిరగడం, సాబీస్కి వొలోడి జోస్కి శవపేటిక దగ్గర మోకరిల్లడగం- అద్భుతమైన దృశ్య సంచయం. వీటన్నిటని రచయిత చారిత్రక సత్యాలతో వర్ణిస్తాడు. సెంకివిక్ చారిత్రిక పరిశోధనలవల్ల అతని పాత్రలు ఆకాలపు పద్ధతిలో మాట్లాడతాయి, చర్చిస్తాయి. సెంకివిక్‌ను నోబెల్ పురస్కారానికి అర్హుడిగా ప్రకటించిన పరిశీలకుల్లో ప్రసిద్ధ చరిత్ర కారులున్నారు.

ఈ నవలా త్రయంలో గొప్ప ప్రకృతి వర్ణనలతో బాటు గొప్ప హాస్యం కూడా వుంది. యోధుడు వొలోడి జోస్కితో బాటు హాస్య చతురుడైన ఉన్నతకులీనుడు 'జగ్లోబా' పాత్ర మరపురానిది. అతని బడాయి, ఆహార్యం, వైన్‌మీది అతని ప్రేమ మనకు ఫాల్‌స్టాఫ్‌ను గుర్తుకు తెస్తాయి. జగ్లోబాది బంగారు హృదయం. అతడు తన మిత్రులకు ఆపదల్లో విశ్వాస పాత్రుడు, ఆహార పానీయాల ప్రియుడు. పైకిమాత్రం పవిత్రుడిగా నటిస్తుంటాడు. అతడు వైన్‌ని ప్రేమిస్తాడు. ద్రోహులు మాత్రమే వైన్‌ని నిరసిస్తారు. ఎందుకంటే తాగితే తాము తమ రహస్యాలను బైటపెట్టేసుకుంటామనే భయంతోనే వాళ్ళలా చేస్తారు. టర్కులు వైన్‌ని సేవించరు. అందుకే వారిని అసహ్యించుకుంటాడు. జగ్లోబా వాగుడుకాయ. వాగకపోతే శీతాకాలంలో నాలుకకాస్తా గడ్డకట్టి బిగిసిపోతుందంటాడు. మిలటరీ అలంకారాలను హేళన చేస్తాడు. తాను భాగస్వామికాని మిలిటరీ సాహసాలను గురించి బడాయిలు పోతాడు. ప్రతి యుద్ధ సంఘటనలోను భయంతో వణికి పోతాడు. యుద్ధం ప్రారంభమయ్యాక శత్రువు తనను ప్రశాంతంగా వుండనీయలేదనే కోపంలో వొచ్చినధైర్యంతో కొసాక్ బుర్లాజౌను ఓడిస్తాడు. ఒడిసియస్‌లాగ పరిస్థితుల నుండి బయటపడడం ఎలాగో అతనికి తెలుసు. అతడు ప్రధానంగా భావోద్వేగి. తన మిత్రులకు యేమైనా జరిగితే కన్నీళ్ళు పెడతాడు. అతడు దేశభక్తుడు. అందరిలాగ తన రాజును వొదిలేసిపోడు. ఈ పాత్రలో స్థిరత్వం లేదని కొందరన్నారు. అదినిజంకాదు. నిజానికి జగ్లోబాది చిన్న పిల్లలమంచితనం. జగ్లోబా ప్రపంచ సాహిత్యపు హాస్యపాత్రలలో ఒకడు.

ఈ నవలాత్రయం తరువాత సెంకివిక్ 1890లో మానసిక విశ్లేషణా నవల 'విదేట్‌డాగ్మా'' రచించాడు. కొందరు విమర్శకులు దీనినే అతని ప్రధాన రచనగా భావిస్తారు. ఈ నవల జర్మన్‌రూపంలో

వుంది. ఇందులోని నాయకుడు ఒక ప్రాపంచిక మానవుడు. అతడు సంశయ స్వభావుడు, తన ఆనందాన్ని తానే పోగొట్టుకుంటుంటాడు, ఇతరుల ఆనందాన్ని త్యాగం చేస్తాడు. ప్లాజోస్కికి నీతి లేదు, మూఢత్వమూలేదు. అతడు అతి సౌందర్యవాది. చివరికంటూ అతడు విధి నిర్వహణ సూత్రాలకు నిబద్ధుడే. మతాభినివేశం లేనివారి హృదయశూన్యాన్ని సౌందర్యవాదం పూరించలేదని రచయిత నిరూపిస్తాడు. ''విదేట్‌డాగ్మా'' కళాత్మక రచన.

దీని తరువాత 1894లో రచింపబడిన గ్రంథం ''చిల్డ్రన్ ఆఫ్ ది సాయిల్'' దీనిలోని ప్రధానాంశం ఉపయోగకరమైన పల్లెజీవనానికి, బోలు తనంతో కూడిన పట్టణ జీవితానికి మధ్యగల వ్యత్యాసం. ఇందులో ప్రధానపాత్ర 'మేరీనియా' ఈ రచనను గురంచి విమర్శకులు కొన్ని అభ్యంతరాలను లేవనెత్తారు. ఈ నవల చివర్లో పోలానికిచ్, అతని భార్య మధ్య మరల ఏర్పడ్డ బంధం మరింత బలపడుతుంది. ఈ రచన ప్రధానంగా గృహస్థ జీవితంలోని మంచి లక్షణాలను ఉన్నతీకరిస్తుంది. ఈ రచనలోని రోగిష్టి బాలిక 'లిట్కా' పాత్ర చిత్రణ ఎంతో ఆకర్షవంతమైనది. ఆమె తన బాల్యప్రేమను పోలానికిచ్, మేరీనియాల కలయిక కోసం త్యాగం చేస్తుంది.

1892లో రచింపబడిన ''లెటజ్‌ఫాలో హిమ్'' ను మరీ వేగవంతంగా నడిపినందుకు విమర్శకు గురయింది. ఇందులోని జమీందారిణి 'అంటీ' జబ్బుతో, భయంకరమైన భ్రమలతో బాధ పడుతుండగా, చనిపోతూ పునర్జీవితుడైన రక్షకుడు రక్షిస్తాడు. ఆయన నవల లలాగే స్కెచెస్‌కూడా చాలా విలువైనవి. మత సంబంధమైన ఆయన రచనలు ఆయనకు ప్రపంచఖ్యాతిని తెచ్చిపెట్టాయి. 1895-96లో అతడు ''క్వొవాడిస్'' వ్రాశాడు. ఇందులో నీరోచక్రవర్తి క్రూరకృత్యాల చరిత్ర వ్రాయబడింది. దీని ఆంగ్లానువాదం ఒకే సంవత్సరంలో ఇంగ్లండు, అమెరికా దేశాలలో 8 లక్షలకాపీలు అమ్ముడు పోయాయి. ఈ పుస్తకం ముప్ఫైభాషలలోకి అనువదింపబడింది. 1991లోనే రెండు మిలియన్ల కాపీలు అమ్ముడు పోయాయి. ఈ గ్రంథం విగ్రహారాధనలోని గర్వాన్ని, క్రైస్తవంలోని నమ్రమైన ప్రేమను వర్ణిస్తుంది. ఇందులో రచయిత నీరోను ప్రముఖ పాత్రను చేయలేదు. అక్కడక్కడ ఆ చక్రవర్తి యొక్క దర్పాన్ని వర్ణించాడు. ఈ పుస్తంకలో అపోస్తలుడైన పౌలు సంధ్యా సమయంలో, బైబిలు టిమొతి 4:7 వాక్యం- ''నేను మంచి యుద్ధం చేశాను, నేను చేయవలసింది ముగిసింది, నా నమ్మకాన్ని నేను నిలుపగలిగాను'' అనే మాటలతో అమరుడయ్యే సందర్భ దృశ్యం అద్భుతమైనది.

ఈ గొప్పరచన తరువాత సెంకివిక్ 1901లో పోలిష్ జాతీయ నవల ''ది నైట్స్ ఆఫ్ ది క్రాస్'' రచించాడు. ఇదులో ట్యుటానిక్ వీరులపై పోలండ్, లిథూనియన్‌దేశాలు చేసిన యుద్ధాన్ని వర్ణించాడు. ట్యుటానిక్ యోధులు గతంలో మతంకోసం ధర్మయుద్ధంచేసినా, చివరికి అధికారంకోసం దేశ విస్తర్ణ కోసం యుద్ధాలు చేసే స్థితికి దిగజారారు. అయితే పోలండ్ రాజైన వ్లాడిస్లా II వారి ఆధిపత్యాన్ని నివారించగలిగాడు. ఈ నవలలో అతనొక పాత్ర. ఇందులోని ఇతర పాత్రలు మధ్య యుగ సంస్కృతికి చెందినవి. ఆ సంస్కృతిలోని మూఢ నమ్మకాలను రచయిత విపులంగా వివరిస్తాడు. దీనిలోని పాత్రలు వ్యక్తిత్వం కలిగినవి. ఈ నవల ముగింపు 1410లో జరిగిన టానెన్‌బర్గ్ యుద్ధంతో, ట్యుటానిక్ ఆధిపత్యపు ముగింపుతో, ఒకగొప్ప సంగీత నాటకాంతంలా ముగుస్తుంది.

సెంకివిక్ ప్రాచీన పోలిష్ సాహిత్యానికెంతో రుణపడి వున్నాడు. సెంకివిక్ సాహితీ సృజన విస్తృతమూ, ఉన్నతమూ అయినది. అతనిది సంపూర్ణ సమగ్రత. ఒక స్వీడిష్ విమర్శకుడు సెంకివిక్ ఉపమానాలకు హోమర్ భావనలకు సామ్యాన్ని గుర్తించాడు. సెంకివిక్ సాహితీ సృజన పూర్తికాలేదు. ప్రస్తుతం అతడు మరొక నవలా త్రయాన్ని ప్రచురించే పనిలో నిమగ్నుడైనాడు.

అతడెన్నో పురస్కారాలందుకున్నాడు. అతడెంత దేశభక్తి గలవాడైనా తన దేశాన్ని పొగడలేదు. రచయితగా అతడు 25 సంవత్సరాలు పూర్తిచేసిన సందర్భంగా దేశ ప్రజలు ఆయన పూర్వీకుల భవంతిని

కొనుగోలు చేసి ఆయనకు కానుకగా సమర్పించారు. ప్రతినిధి బృందాలు ఆయన్ని గౌరవించాయి. ఎందరో ఆయన్ను అభినందించారు. వార్సాథియేటర్‌లో ఆయన గౌరవార్థం ఒక నాటకాన్ని ప్రదర్శించారు. ఉత్తరాది నుండి లభించే గౌరవాభిమానాలకు ప్రతీకగా నోబెల్ అకాడెమి 1905వ సవత్సరపు నోబెల్ సాహితీ పుస్కారాన్ని ఆయనకు ప్రదానం చేయాలని నిర్ణయించింది.

**అంగీకారం :**

నోబెల్ బహుమతికోసం దేశాలు తమ కవులతో, రచయితలతో పోటీపడతాయి. ఈ పురస్కారం ఆయా కవులను, రచయితలనేగాక, ఆయా దేశప్రజల ప్రతినిధులుగా, ఆ ప్రజల తనయుడైన అతణ్ణీ, ఆ ప్రజల్నీ ఉన్నతుల్ని చేస్తుంది. విశ్వోన్నత్యంలో ఆ విధంగా ఆ దేశం పాలుపంచుకుంటుంది. ఆ విధంగా మానవాళిమంచికోసం, తన హక్కుకోసం జీవిస్తుంది. ఈ పురస్కారం పోలెండుకు మరీ అమూల్యమైనది. పోలెండ్ చనిపోయిందనీ, అలసిపోయిందనీ, బానిసగా మార్చబడిందనీ అన్నారు. కాని, ఇది పోలెండు విజయానికి సాక్ష్యం.

ఇది నాకు లభించిన పురస్కారం మాత్రమేకాదు. ఎంతో సారవంతమైన పోలెండులో నాకంటే గొప్ప రచయితలెందరో వున్నారు. ఇది పోలెండు మేధాశక్తికి లభించిన పురస్కారం. ఒక పోలీయుడిగా మీకందరికి, స్వీడిష్ అకాడెమి సభ్యులకు నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ హోరేస్ మాటల్ని గుర్తుచేసుకుంటున్నాను.

**జీవిత చరిత్ర :**

హెన్రి సెంకివిక్ (1846-1916) 19 శతాబ్దపు రెండో అర్ధభాగానికి చెందిన పోలిష్ రచయిత. అతడు వొల్‌క్రజెస్కాలో, రష్యాకు చెందిన పోలెండులో జన్మించాడు. అతనితండ్రి పోలెండు స్వాతంత్ర్య విప్లవంలో పాల్గొన్నాడు. అందుచేతనే సెంకివిక్ రచనల్లో అంత దేశభక్తి కనుపిస్తుంది. తల్లి కుటుంబీకులు చదువుకున్నవారు.

సెంకివిక్ వార్సాలో చదివాడు. రచయితగా తన ప్రత్యేకతను గుర్తించాడు. అతని మొదటి రచనలు కేవలం వ్యంగ్యపూరితాలు. వాటిలో బలమైన సామాజిక స్పృహలోపించింది. 1876లో అమెరికాలో కాలిఫోర్నియా వరకు పర్యటించాడు. అతని పర్యటనానుభవాలను పోలిష్ వార్తాపత్రికలలో ప్రచురించాడు. వాటికి గుర్తింపు లభించింది. 1882లో ''ది లైట్ హౌస్ కీపర్'' రచించాడు.

పోలెండుకు తిరిగివొచ్చిన తరువాత సెంకివిక్ చరిత్ర పఠనంలో మునిగిపోయాడు. ఫలితంగా 17వ శతాబ్దపు మధ్య భాగానికి చెందిన పోలెండును గురించిన నవలా త్రయం ''విత్ ఫైర్ అండ్ స్వోర్డ్'', ''దిడెల్యూజ్'', ''పాన్‌మిచెయిల్'' 1884, 1886, 1888లలో ప్రచురించాడు. వీటి తరువాత 1891లో ''విదేట్‌డాగ్మా'' అనే మనస్తత్వ విశ్లేషణారచనను, 1894లో ''చిల్డ్రన్ ఆఫ్ ది సాయిల్'' అనే వ్యవసాయదారుల్ని గురించిన రచన చేశాడు. 1895లో అతడు రచించిన అత్యుత్తమ రచన ''క్వొవాడిస్'' ఇది నీరో చక్రవర్తికాలంలో క్రైస్తవులపై జరిగిన హింసను వివరించే నవల.

అతని తరువాతి నవలలో మళ్ళీ చారిత్రక విషయాలనే తీసుకున్నాడు. 1900లో రచించిన 'క్రాజీజసీ' మధ్య ప్రాచ్య చరిత్రలో ట్యూటానిక్ యోధులపై పోల్స్ సాధించిన విజయాన్ని వర్ణిస్తుంది. 1906లో రచింపబడ్డ ''ఆన్ ది ఫీల్డ్ ఆఫ్ గ్లోరీ'' అంతకు ముందుర రచించిన నవలా త్రయానికి అనుబంధం. 1910లో రచింపబడ్డ ''విర్ల్‌పూల్స్'', 1912లో రచింపబడ్డ, ''ఇన్ డిజర్ట్ అండ్ వైల్డర్‌నెస్'' రెండూ సమకాలీన విషయాలను గురించిన రచనలు.

సెంకివిక్ అత్యంత ప్రజాభిమానాన్ని చూరగొన్న రచయిత. 1900లో దేశ వ్యాప్తంగా ధనాన్ని పోగుచేసి, అతని ప్రాచీనులకు సంబంధించిన భవనాన్ని కొని ఆయనకు బహూకరించారు. 1948-55లలో అతని సంపూర్ణ సాహిత్యం అరవై బాగాలుగా ప్రచురింపబడింది.

# సీమారహిత సైకత కాసారం

- అశ్వినీ కుమార్

**సైకతకాసారం :** ఒక అనుభవం తరక. కాలదేశాల కతీతమైన ఒక మెరుపు. దిగంతాల కావలి తటిత్తు. చెప్పక చెప్పే విస్ఫోటనం. ఒక జలదరింపు. అస్తిత్వం గుర్తింపు. తన్నుతా గుర్తించిన మిణుగురు వెలుగు. గ్రీకు దేవత డెల్ఫి సోక్రటీజ్ know thyself, బుద్ధుని Forget thyselfల ఆకస్మికావిష్కారం. స్త్రీ పురుష సమీకరణం, నాగరకతా పేలవత - అన్నీ కలబోసిన సమాహారం - సం.

ఎడతెగని అలలతో సముద్ర తీరాలు ఎలా ఆహ్వానిస్తాయో, ఎల్లలు లేని ఎడారులు - తడారిపోయిన సైకత తరంగాలతో అలాగే నన్ను ఆకర్షిస్తాయి.

మహా సముద్రాలు నన్నెంతగా ఆశ్చర్యపరుస్తాయో, సహారా ఎడారులూ నాకు అంత అద్భుతంగా దర్శనమిస్తాయి!

నడి సముద్రంలో నావపై నిలబడి దూరదూరంగా వంగిన ఆకాశం చివరల ఎక్కడైన ఇంత నేల చెక్క కనపడుతుందా అని వెదికాను.

అలాగే ఎడారి గుడారం పక్కనుంచి దిగంతాల అంతం కోసం చూపులు సారించాను.

★ ★ ★

అప్పుడే ప్రొద్దు క్రుంకింది! ఎడారి సాయంత్రం ఆకాశం కూడా ఇసుక రంగులో మారింది. పక్షుల సందడి లేని వింత నిశ్శబ్దం, పరచుకుంటున్న చీకటిలా కప్పుతుంది.

ఎడారి దాటాలని - ఉబలాటపడి, అపరిచితుల గణంలో చేరినపుడు - ఈ ప్రయాణం ఇంత దుష్కరంగా, కఠినంగా ఉంటుందనుకోలేదు!

పగలంతా శోష వచ్చే ఎండవేడిమిలో - చిరచిరలాడుతూ మండిపడే ఎడారిని నిర్వికారంగా చూస్తూ - ప్రయాణం!

రాత్రికి చిన్న గుడారాలలో నిర్దయగా వీచే చలిగాలులకు వణుకుతూ నిద్రపోవటం -

పరిచయం లేని వ్యక్తుల సహ ప్రయాణం, కర్కశమైన పగటి వేడి ప్రయాస, వీటి నుంచి నాకు రాత్రి చల్లదనం కొంత ఉపశమనం!

ఎప్పుడు చీకటి పడుతుందా అని ఎదురు చూడటం - అందరూ నిదరపోగానే - మెల్లగా లేచి - అటూ ఇటూ తిరగటం - అలా ఈ ఒంటరి ప్రయాణంలో ఒకరాత్రి! ప్రతిరాత్రి లాగానే బయలుదేరాను ఒంటరిగా!

పెను చీకటి ఎడారిలో పెద్దగా నిద్దరోతున్న చందమామ! దూరదూర లోకాలలో తేజోవంతమైన పాలపుంత వెలుగుముద్ద!

---

వి. అశ్వినికుమార్, విజయవాడ, పాన్ ఏషియన్ ట్రావెల్ ఏజన్సీ ప్రెసిడెంట్,
సాహితీ వ్యవసాయం అభిరుచి.

చీకటి చాందినీలో వేలాడుతున్న వెండి చందురుడు. వెలుగు నవ్వులతో రారమ్మని పిలిచే రేరాజు! అలా ఎంతసేపు నడిచాను - ఎటు నడిచాను ?

చుట్టూ విస్తారంగా నిస్తేజంగా ఎడతెగని ఎడారి!

అత్యుత్సాహంతో అగమ్య సంచారం ఎంతసేపు గడిచింది? పేలవంగా నవ్వుతున్న చంద్రుణ్ణి చూసినపుడు ఈ విహారంలోని ప్రమాదం తెలియవచ్చింది.

అనంత కాలంలో కాలి వేగిన ఇసుకనేల - ఎక్కడా గతం గురుతులు లేని విశాల సైకత కాసారం!

ఆందోళనను అణుచుకుంటూ - భయాన్ని కప్పుకుంటూ, ఎక్కడ బయలుదేరానో - అక్కడకు ఎలా చేరాలో ?

★ ★ ★

ఒక్కసారిగా చుట్టూ చూశాను! పైకీ చూశాను! దిక్కు తెలియని చుక్కలదారి - చుక్కానిలేని ఎడారి నావ! ప్రశాంత నిశాంత ఏకాంత స్థితి !

నిస్సహాయ నిర్వేదంలో ఏదో తెలియని హాయి! అర్థం లేని - అర్థం కాని ఒక జీవిత గమ్యం! అగమ్యపు అనంతంలో అసంకల్పపు ప్రస్థానం!

అనంత లోకాల తళుకుమినుకు వెలుగు చినుకుల క్రింద, అవతల తెలియని ఈ ఎడారి కాసారంలో, నేనొక ఇసుకరేణువు!

ఈ అనంత విశ్వపు పరిమాణం - నా అత్యల్ప పరిమితులు నాకేదో నిగూఢ సత్యాన్ని తెల్పుతున్నాయి?!

★ ★ ★

తన పుట్టుకకు, బాల్యానికి, ఎగిసిపడిన యౌవనానికి, తను చదివిన పుస్తకాలు - నేర్చిన కంప్యూటర్ విద్య, కారు డ్రైవింగ్, పారా గ్లైడింగ్, తన ప్రయాణాలు - ఇప్పుడు - ఇక్కడ నుంచి తనను సురక్షితంగా బైట పడవేయగలవా ?

ఒక్కసారిగా ఒళ్లు జలదరించింది! అత్యుత్సాహంలోని మూర్ఖత్వం నాముందు నిలబడి వెకిలిగా నవ్వింది !

పలుచని బట్టలతో, ఎడారి చలిగాలిలో, నోరు తడిచేందుకు చుక్క నీరు లేకుండా ఎటు అడుగు వేయాలో తెలియని అయోమయంలో - ఒక వింత మానసిక స్థితిలో ఎంతసేపు ఎటు తిరిగానో?

★ ★ ★

విమానం ఎక్కినపుడు - అత్యవసర పరిస్థితిలో ఎలా బైటపడాలో చూపిస్తారు. ఓడ ప్రయాణంలో అయితే రెండు మూడు క్లాసులే తీసుకుంటారు. పడవ మునక వేళలో ఏది ఎలా వాడాలో, ఎలా చెయ్యాలి? అలాగే ఈ ఎడారి యాత్ర మొదలులోనే మా అరబ్బీ గైడు - తప్పని సరిగా పాటించవలసిన ఎడారి జాగ్రత్తలు, ఎక్కడ బయలుదేరింది ఎలా గుర్తు పెట్టుకోవాలో - అన్ని జాగ్రత్తగా తెలియచెప్పాడు. మామూలుగానే - ఇవేమీ మనము అంతగా పట్టించుకోము కదా! సరిగ్గా అటువంటి విషమ పరిస్థితిలో చిక్కుకున్నపుడే అని గుర్తుకురావు.

★ ★ ★

రాత్రి చలి రెక్కలు విప్పి వాలుతుంది

కర్కశమైన ఎడారి రాత్రి జడత్వానికి వళ్లు పగుళ్లు - కఠినమైన మండుటెండల పగటి బొబ్బలకు తీసిపోవు. ఏమీ చెయ్యలేని స్థితి - ఆందోళన ఉధృతి తగ్గి ఆవేదన, గత స్మృతుల చింతనలోని ఒక నిశ్చింత - తర్వాత ఒక తెలియని నిరీక్షణ .....

వెలవెలబోతున్న ఎడారి వెన్నెల విశాలంగా అనంతంగా నిశ్చితంగా పరుచుకుంది.

గత కాలపు ఇసుక తుఫానుల గాలి గురుతులు తప్ప మరేమీ కానరాని విశాలం! విషాదం.

ఒక మహా నిశ్శబ్దం ఆవరించిన ఈ ఎడారి నైరాశ్యపు వైశాల్యంలో అలా అగమ్యంగా ఎంతసేపు తిరిగానో? దూరకాలాలు ఏకమైన ఒక విచిత్ర సంకట స్థితి! ఆశావేశాలు కలగలిసిన ఒక వింత మనసు గతి!

బ్రతుకు రహస్యం - ప్రకృతి సత్యం ఎదురైన ఒక మార్మిక సంశయం!

సముద్రాలు, మహారణ్యాలు - సహారాలు ఇలా నేల నాలుగు చెరగులా తిరిగే నిరంతరాణ్వేషణలకు ఒక నైరూప్యపుటావిష్కారం!

నిద్రరాని - వాలిపోతున్న కనులకు - ఏది కనపడినా భ్రమగానే అనిపిస్తుంది!

నిరాకారమైన ఎడారి విస్తారంలో ఒక ఆకారం! ఆధారం లేకుండా, ఒక పోగుమంట వెలుగులో వికారంగా వంగి, అల్లంత దూరంలో! భ్రమా?

అంతలోనే నాలో తెలియని ఉపశాంతి!

నిస్సహాయ స్థితిలో నుంచి, తొలి ఉపశమనలో నుంచి, వెంటనే చుట్టుముట్టిన భయం!

★ ★ ★

కొంతసేపటికి - అది భ్రమకాదు - అని నన్ను నేను నమ్మించుకుని మళ్లీ పరికించి పరీక్షగా చూశాను!

ఇప్పుడు, తీర్చి దిద్దిన ఆకారం! చీకటి వెలుగుల దోబూచులాటలలో ఎవరో శిల్పి మలచినట్లు!

స్వచ్ఛమైన సరళత - విస్తారమైన వస్త్రాలు - నురగల తరకల తెలుపు - ఆ జేగురు మంట వెలుగులో బంగారు జరీలావిస్తృతంగా చుట్టిన తలపాగా!

ప్రక్కనే కసివింద చెట్టు గాలికి ఊగుతూ, అంతలో ఒంటె సకిలింపు!

ఎల్లలు తెలియని ఎడారిలో, ఒక మహాద్భుతమైన నిశ్శబ్దాన్ని బద్దలు కొడుతూ !

★ ★ ★

సహాయంకోసమో, ఒంటరి తనపు సహవాసపు తపనతోనో, తెలియని స్థితిలోంచి మెల్లగా ఆ పోగుమంట వెలుగువైపు, ఆ తరళ అంగీ అగంతకుని దగ్గరకు చేరాను. అప్పుడే నాకు ఒక్కసారిగా గుర్తుకువచ్చింది నేనొక స్త్రీనని!

★ ★ ★

ఆ పరిస్థితిలో... చీకటిలోనుంచి - తడబడుతూ వస్తున్న పాంటు - చొక్కా వేసుకున్న - ఓ స్త్రీ ఆకారాన్ని చూసి - అతను కూడా ఆశ్చర్యపోయి వుండవచ్చు.

ఆ చలిమంట వెలుగులో, నన్ను తేరిపార చూశాడు! నేను వేసుకున్న పలుచని పాంటు - తెల్లని అంటిపెట్టుకున్న చొక్కా - వదులుగా కదులుతున్న జుట్టు నా స్త్రీత్వాన్ని ఏమాత్రం దాచలేకపోతున్నాయి, సరికాదా, వెనుక వెన్నెల, ముందు చలివెలుగు - నాలో చెలరేగే ఆందోళనను అణచుకునే ప్రయత్నం - ఇవన్నీ అతని దృష్టిలో పడుతున్నట్లు గ్రహించాను.

ఈ ఎడారి భాషలో నాకు రెండే మాటలు వచ్చు -

''ఫోమా, ఫోమా'' అని చేయి అందించాను ధైర్యాన్ని కూడ కట్టుకుని!

అంటే, ''మీరు బాగున్నారా, మీ మేకలు, ఒంటెలు, గాడిదలు బాగున్నాయా?'' అని అనుకోవచ్చు!

అతను తల అడ్డంగా ఊపాడు - అర్థం కానట్లు! కాని నాచేయి అందుకుని, మంట దగ్గరకు తీసుకు వెళ్లాడు! కూర్చోమని సంజ్ఞ చేశాడు.

ఎండు కట్టెలు చిటపటలాడుతూ మండుతున్నాయి. చిదుకులు చిరచిరలాడుతూ చలిని తరుముతున్నాయి. గాలికి ఊగిసలాడుతూ ఎగిసిపడుతున్న వెలుగు తెరలు చీకటిలో పరచుకుంటున్నాయి.

అక్కడ వున్న జాడిలో నుంచి వేడి టీ - ఒక గ్లాసులో ఎత్తిపోసి, మళ్లీ జాడిలో పోసి ధారగా గ్లాసులో నింపాడు నురుగులతో! నా చేతికి అందించి - మెల్లగా ఏదో అంటున్నాడు.

ఈసారి నేను తల అడ్డంగా ఊపాను అర్థం కానట్లు! కసివింద చెట్టు కింద, ఒంటె సకిలించింది. మళ్లీ - అతను లేచి ఒంటె దగ్గరకు వెళ్లి - ఒక పొడవాటి తెల్లని వస్త్రాన్ని తెచ్చి నా భుజాల చుట్టూ కప్పాడు! నా లోలోపల దుఃఖం పొంగుకొస్తుంది - బైటకు బింకంగా ఉన్నాను.

★ ★ ★

ఈ ఎడారి యాత్రకు ముందు - ఒకటి రెండు పుస్తకాలు చదివాను. వీరి తెగలు - అలవాట్లు - మాటలు తెలుసుకుందామని. ఇక్కడ సంచరించే రెండు మూడు తెగల వాళ్లు- తమ తమ జాతి అంటే వారికి విపరీతమైన అహంకారం - గౌరవం! అలాగే వారి అలవాట్లు కట్టుబాట్లు చాలా విశృంఖలంగా వుంటాయి. వీరు స్త్రీ పురుష సంబంధాలు చాలా తేలికగా తీసుకుంటారు. ఉదాహరణకు మగవాడికి ఏ స్త్రీ అయినా నచ్చితే - ఆమె చేయి పట్టుకుని, అరచేతిలో మృదువుగా రాస్తే - వెంటనే అతనితో దగ్గరలో పొదమాటుకు వెళ్లవలసిందే! ఇవన్నీ గుర్తు వస్తుంటే నాలో భయం ఎక్కువవుతోంది. కప్పుకుంటానికి అతను ఇచ్చిన అంగీని ముఖానికి కప్పుకున్నాను.

అతను నవ్వుతూ దగ్గరకు వచ్చి ముఖం మీద నుంచి తీసి మళ్లీ భుజాల మీద వేశాడు. ఇక్కడ ఆడవాళ్లు ముఖం మీద కప్పుకోరు! అతనికి ముప్ఫయి దాటవచ్చు! చెక్కినట్లు ముఖ కవళికలున్నాయి. పెద్ద కళ్లు - బాదంకాయలు మాదిరి. రాగి వన్నె శరీరం! మంటలకు మెరుస్తోంది!

రెండు గ్లాసులు టీ తాగేక నేను వచ్చిన భాషలో చెప్పటం మొదలు పెట్టాను. అతనికి అర్థం కాలేదని తెలుస్తానే వున్నది. భయం అణుచుకునేందుకు వాగుతూనే వున్నాను. చేతితో చూపాను, దారి తప్పాను

ఎటుపోవాలో తెలియటం లేదు - గుడారాలెక్కడ వున్నాయో తెలియదని - అతనికి అర్థమయ్యేదెలా? అతను బాచిపెట్టి వేసుకుని నాకు టీ అందిస్తూనే వున్నాడు - తియ్యని వెచ్చని టీ! ఒక్కసారిగా నేను మాట్లాడటం మానివేశాను! అతని వంక చూశాను! ఈ బ్రహ్మాండమైన ఎడారి విస్తారాన్ని గుర్తించాను. ఈ చలి మంట వెలుగు - ఈ తియ్యని వెచ్చని తేనీటి రుచి - ఇవన్నీ జీవితాంతం నాతోనే వుంటాయని అనిపించింది. ఈ అపరిచిత అగంతకుడు నాకు అత్యంత ఆత్మీయుడు, ఆంతరంగికుడు అనుకున్నాను. అతన్ని చూసి నవ్వాను! అతనితో పంచుకోవటానికి నాకు రెండు మాటలు కూడా రావే? మా యిద్దరి జీవన గతులకు ఎంతటి అగాధం వుంది !!

అంతలోనే నాకనిపించింది - ఇతను ఎప్పుడైనా స్కూలుకు వెళ్లాడా? కారు ఎక్కాడా? ఏదైనా నగర పరిసరాలు చూశాడా? కనీసం ఫోను కూడా తెలుసుంటుందా? ఏమో కాని, ఇప్పుడు - ఇక్కడ ఇతని విజ్ఞత, జ్ఞానం ఇతని సహాయం నాకు కావాలి - ఎందుకంటే - నాకు తెలిసిన అధునాతన విజ్ఞానం - సాంకేతిక జ్ఞానం - ఇప్పుడు ఎందుకూ పనికి రాదు కదా! అంతేకాదు, మహిళల హక్కుల కోసం నేను నడిపిన ఉద్యమాలు ఇక్కడ అక్కరకు రావు కదా!

ఇతని దయ, మంచితనం కూడా నాకు కావాలి, ఈ బ్రహ్మాండమైన ఎడారిలో అగమ్యంలో నుంచి నేను బైటపడాలి! అది అతని వలనే అవుతుంది !

అంతలో అతను మెల్లగా లేచాడు. మంట మీద ఇసక జల్లాడు - ఒంటె దగ్గరకు వెళ్లి - పగ్గం సరి చేశాడు. నన్ను రమ్మని సైగ చేశాడు.

అతను ఇచ్చిన తెల్లని గుడ్డ కప్పుకుని - అతని వెనకే బయలుదేరాను. ఆ వెలిసిన వెన్నెల వెలుగులో అతని తెల్లని బట్టలు - నాకు దారిచూపుతున్నాయి. ఆ మహా నిశ్శబ్దాన్ని భరించలేక నేను ఒక్కసారిగా ఏదో వాగేదాన్ని, అతను ఆగి నాచేయి అందుకునే వాడు - ఏమిటి అరచేతిలో? ఒక రకంగా నాలో బెదురుపోయింది. నేను దేనికోసం ఎదురుచూడటం లేదు. అతని కదలికలో ఎటువంటి శృంగార పరమైన భావ సంజ్ఞలు రాలేదు! ఎంత సేపు నడిచాం ?

అతను ఎంతో అలవోకగా గమ్యం తెలిసిన హుందాతనంతో అడుగులు వేస్తుంటే, వెనువెంట నేను తడబడుతూ నడుస్తూ - అనాకారమైన నిశ్శబ్దాన్ని భరించలేక - ఏదో వాగుతూంటే అతను నావంక చూసి నవ్వుతూ చేయిపట్టుకుని నడిపించేవాడు!

నాగరకతల అగాధాల కిరువైపుల ధృవాలు కలిసి పయనిస్తున్నట్లు - అంతలో నేను వదిలివచ్చిన గుడారాలు పది అడుగుల్లో కనపడినాయి. అతను ఈ బ్రహ్మాండమైన ఎడారిలో - ఈ నాలుగు గుడారాలను ఎలా కనుగొనగలిగాడో ఇప్పటికీ నాకు అంతు చిక్కని ఆశ్చర్యమే ! అద్భుతమే !

అతని వంక తిరిగి నాచేయి హృదయం మీద పెట్టుకుని నాకు తెలిసిన రెండో మాట - ''అబర్కాది'' అన్నాను - కృతజ్ఞతలు! అతను నవ్వాడు - స్వచ్ఛంగా !

అతను రెండు చేతులు పైకి ఎత్తి - నాకు వీడ్కోలు చెప్పాడు - నేను అతను వెళ్లిన వైపే చూస్తున్నాను - అతను ఎడారి రాత్రిలో కలిసిపోయాడో -

లేక ఆ ఎడారి అతన్ని తనలో కలుపుకున్నదో, వాలిపోతున్న కనులతో, నేను చూస్తూనే వున్నాను!!

# సుఖ జీవనానికి మార్గాలు

- సి. వి. సర్వేశ్వర శర్మ

ఒక రూల్‌కి మినహాయింపు ఉంటుంది. ఒక చట్టంలో సందిగ్ధత ఉండవచ్చు. కాని సుఖ జీవనానికి సంబంధించిన నీతి సూత్రాలు - మార్గాలు అన్ని వేళలా అన్ని ప్రాంతాల్లో వర్తిస్తాయి. ఇవి మనిషిని ధనవంతుడిని చేయలేవు. కాని అతని జీవితాన్ని సుఖమయం చేస్తాయి. సంతృప్తికరమైన జీవితాన్ని తెచ్చిపెడతాయి.

దురాశ, అసూయ, ద్వేషం, కోపం, విభేదాలు, విరోధాలు, వంటివి జయించాలి. అప్పుడు సులువుగా మానసిక ప్రశాంతత లభిస్తుంది. ప్రతి పనికి ఎవరినో కారకులను చేసి సరిపెట్టుకోకూడదు. నేరాలు - ఘోరాలు, హత్యలు - దొంగ తనాలు వంటివి చేసి చేసేందుకు నేనెవరిని ప్రతిదానికి ఆ భగవంతుడే కారకుడని సమాధాన పడడం లేదా చెప్పడం అలవాటు చేసుకుంటే ఎలా?

తాము చేసే వృత్తిలో తమకు తెలిసిన అడ్డదార్లు తొక్కి సంపాదనే ధ్యేయంగా పెట్టుకుని 'మానవసేవ'ను విస్మరించి ఆ తరువాత పాప ప్రక్షాళన పేరుతో యాత్రలు, బాబా దర్శనాలు, పూజలు, పునస్కారాలు చేసేవారెందరో మనకు కన్పిస్తూ ఉంటారు. వీటికోసం పెట్టే ఖర్చు, వినియోగించే కాలం ఎంతో శ్రమను కల్గిస్తూ ఉంటాయి. తాము ఇలా నష్టపోతున్నామనే విషయం గ్రహించుకోగల్గితే తమ వృత్తిలో న్యాయ బద్ధతను పాటించి ఎనలేని తృప్తిని పొందగల్గుతాడు మనిషి.

**మనిషి ప్రత్యేకత**

సమస్త జీవరాశికి లేని ప్రత్యేకత మనిషికి ప్రకృతి ప్రసాదించింది. అదే బుద్ధి కుశలత. కాని ఈ బుద్ధిని ఎన్ని రకాలుగా వినియోగించాలో అన్ని రకాలుగా వినియోగిస్తున్నాడు మనిషి. ప్రగతిని సాధించడమే కాదు ఇతరులను అధోగతికి తీసుకు వెళ్లడంలో కూడా వెనుకాడడం లేదు.

ఆలోచనలను నోటి ద్వారా ప్రచారం చేస్తూ సాటి మానవులను మూఢ నమ్మకాలలో ముంచేస్తూ విలువైన కాలాన్ని విలువలేని కాలంగా, ప్రాణాపాయం కూడా కల్గిస్తూ కొంతమంది తమ ఉనికిని చాటుకుంటున్నారు.

విచిత్రం ఏమిటంటే మనిషి తనకు కూడు, గుడ్డ, గూడు వంటివి ఏమాత్రం చేకూర్చలేని మూఢ నమ్మకాలను నమ్ముకుంటూ, మోసపోతూ ఉండడం తరచు జరుగుతోంది. ఈ విషయాలకు ఎంత ప్రచారం కల్గించినా మళ్ళీ అదే ఉచ్చులో కొత్తవారు ఇరుక్కుపోవడం జరుగుతోంది.

**బాబాలు, స్వామీజీలు.....**

అందరిలాగే మాతాజీలు, బాబాలు, స్వామీజీలు వంటి వారు కూడా తలిదండ్రుల కారణంగా జన్మించారు. వారిని పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు నేర్పించారు తలిదండ్రులు. రెక్కలు వచ్చిన తరువాత ఎవరికి వారే ఏదో ఒక వృత్తిలో ప్రవేశించి జీవనం సాగిస్తారు.

సమాజంలో మనకు దర్శనం ఇచ్చే బాబాలు, స్వామీజీలు, మాతాజీలు, తమ జీవనం కొనసాగింపుకు ప్రజలలో ఉండే నమ్మకాలను ఆలంబన చేసుకుని తమ మార్గాలను ఎన్నుకున్నారు.

---

సి. వి. సర్వేశ్వరశర్మ, అమలాపురం, శ్రీ కోనసీమ భానోజీ రామర్స్ కళాశాలలో భౌతిక విజ్ఞాన శాస్త్ర శాఖలో రీడర్‌గా పనిచేసి రిటైర్ అయినారు.

ఇతర వృత్తులకన్నా ఈ వృత్తిలో మెరుగైన సుఖ జీవనం గడిపేందుకు మార్గాలు అనువుగా వుండడం వీరికి ఎంతగానో సహకరిస్తున్నాయి. ప్రజల నమ్మకాలను పునాదిగా చేసుకుని తమ ఉనికిని చాటుకుంటున్నారు. ఇతర సామాన్య ప్రజ మాదిరిగా వీరికి అలవాట్లు ఉండడం, నిద్రించడం, కాల కృత్యాలు తీర్చుకోవడం వంటివి ఉండడమే కాదు, చివరకు కాలధర్మం చెందడం కూడా జరుగుతోంది.

ఏవిధమైన మహత్తులు, శక్తులు, మహిమలు లేవని తెలిసినా పూజలు, పునస్కారాలు చేస్తూ దైవం అంటూ వీరిని కొలిచే ప్రజలను చూస్తుంటే వారి మానసిక శక్తిని ఎలా అంచనా వేయాలి? అన్పిస్తుంది.

**మొక్కుబడులు**

తరతరాలుగా ప్రజలు మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. ఈ మొక్కుబడులు వల్ల ఏదైనా అనూహ్యమైన విశేషాలు జరిగాయా? అన్నది జవాబులేని ప్రశ్నగానే మిగిలిపోతోంది. ఉదాహరణకు క్రికెట్ ఆటలో మన జట్టుగెలవాలని మన దేశంలో ఎంతో మంది పూజలు చేయడం జరుగుతోంది. అదే విధంగా వర్షాలు రావాలని పూజలు చేస్తున్నారు. ఇవన్నీ వారి నమ్మకాలుగానే మిగిలిపోతున్నాయి తప్ప ఫలితాలు కన్పిస్తున్నాయా? తమాషా ఏమిటంటే ఇటువంటి విషయాలను తార్కిక దృష్టి లేదా విమర్శనా నైజంతో చూసేందుకు కూడా భయపడే జనం ఎక్కువగావున్న సమాజం మనది.

**ఆలోచించాలి!**

సమాజంలో ఎన్నో రకాలయిన సమస్యలు. ముఠా తగాదాలు, వర్గ కక్షలు, కులాల కురుక్షేత్రాలు, ఆర్థిక తగాదాలు వంటివి తరచు మనం చూస్తూనే వున్నాం. ఎవరికి వారే తమకు అనుకూలంగా, లాభసాటిగా పరిస్థితులు అనుకూలించాలని పోటీ పడుతూ వారికి నచ్చిన దేవాలయాలకు, లేదా బాబాలవద్దకు వెళ్ళి మొక్కుబడులు సమర్పించుకుంటూ, విరాళాలు ఇస్తూ, కానుకలను అందిస్తూ తమదే పైచేయి కావాలని ప్రయత్నాలు చేయడం జరుగుతూ ఉంటుంది.

ఎవరికి వారే తమదే రైటు అని, భగవంతుడు తమకు సహకరిస్తాడని భావిస్తూనే ఉంటారు. ఇరువర్గాల వారి భ్రాంతి, భ్రమ మనకు ఆశ్చర్యంగా అన్పిస్తుంది. ఖచ్చితంగా ఇద్దరిలో ఎవరో ఒకరు నెగ్గుతారు. ఆ నెగ్గినవారు దైవానుకూలత వల్లనే తమకు న్యాయం జరిగిందనుకోవడం మరొక నమ్మకం. ఇద్దరున్నప్పుడు ఎవరికో ఒకరికి తీర్పు అనుకూలంగా ఉంటుందనే ప్రాథమిక విషయం వీరి దృష్టి నుండి తప్పుకోవడం గమనించవలసిన విషయం.

ఇదిలా ఉండగా తమవద్దపనిచేసే ఏ ఉద్యోగి అయినా ఎంత విధేయతతో వున్నా ఎప్పుడైనా ఆలస్యంగా వచ్చినా, చిన్న అబద్ధం చెప్పినా సహించలేరు. రెండు మూడు సార్లు ఆ ఉద్యోగి ఇదే విధంగా ప్రవర్తిస్తే ఆ ఉద్యోగికి నీతినియమాలు లేవని, అబద్ధాలు చెప్పడం అలవాటని, అతని వల్ల తమకు నష్టాలు వస్తున్నాయని భావిస్తూ ఉంటారు.

మరి ఏదో ఆశించి కొనసాగించే పూజా కార్యక్రమాలకు బోలెడంత ఖర్చు, శ్రమ భరించాలి. మరి ఆ తరువాత తమ పూజలకు ఫలితం దక్కిందా అని ఎందుకు ఆలోచించలేక పోతున్నారు? ఈ విషయం ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. దానికి కారణం అలా ఆలోచించే ధైర్యం చాలామందికి లేకపోవడమే అని చెప్పుకోవచ్చు. అందుకే ధైర్యం తెచ్చుకుని ఆలోచించడం అలవాటు చేసుకోవాలని సలహా.

**మూఢ నమ్మకాలు**

దైనందిన జీవితంలో చాలామంది ఎన్నెన్నో మూఢ నమ్మకాలను పాటిస్తూ తమ సమయాన్ని వృధా చేసుకోవడం, ఇతరుల మనసును గాయపరచడం జరుగుతూ ఉంటుంది.

జోరు తగ్గినా ఇంకా అక్కడక్కడ దెయ్యాలు, భూతవైద్యాలు, చేతబడులు వంటివి వినిపిస్తూనే వున్నాయి. శవానికి ఎదురు రాకూడదని, ఉదయాన్నే వితంతువును చూడకూడదని, నల్లపిల్లి శకునం మంచిది కాదని, ఎవరైనా మరణిస్తే ఆ ఇంటి పేరు గలవారు మైల పాటించాలని, హరిజనులు అంటరాని వారని, ఫలానా వారాలు ప్రయాణాలకు పనికిరావని, వర్జంలో బయలు దేరరాదని, ఫలానా రోజున ఫలానా దిక్కుకు వెళ్ళకూడదని... ఇలాంటి విచిత్ర నమ్మకాలు ప్రజలలో పాతుకుపోయి ఉండడం చూస్తే మనం పురోగమనంలో వున్నామా? తిరోగమనంలో వున్నామా? అని అనుమానం వస్తూ ఉంటుంది. కొన్ని మూఢ నమ్మకాలు క్రమంగా అంతరించి పోతున్నా అంతకన్నా రెట్టింపు వేగంతో కొత్త మూఢ నమ్మకాలు ప్రజల్లో విస్తరిస్తున్నాయి. తార్కిక దృష్టి, శాస్త్రీయ దృక్పథం, హేతువాద ధోరణి మాత్రమే మనుషుల్ని ఈ మూఢనమ్మకాల నుండి బయటకు తీసుకు రాగలవు.

వారసత్వంగా దిగుమతి అవుతున్న నిరాధార నమ్మకాలు 'విజ్ఞానం'గా పరిగణించగలమా? అనాలోచితంగా తరువాత తరాలకు వీటిని అందించడంలో ఎంత పొరబాటు చేస్తున్నామో ఆలోచించుకోవాలి. 'విజ్ఞానం' అంటే 'వాస్తవాల' ఆధారంగా 'నిరూపణకు' నిలచే విషయాలు మాత్రమేనని గుర్తుంచుకోవాలి.

ప్రార్థనలు, పూజలు వంటివి చేస్తే ఉత్తమ జన్మ లభిస్తుందని, స్వర్గం ప్రాప్తిస్తుందని ప్రజలను నమ్మించేవారిని ఎందరినో చూస్తూ ఉంటాం. అసలు అలా ప్రచారం చేసేవారికి లేదా ఇంతకు మునుపు ఎవరైనా స్వర్గాన్నికి వెళ్ళిన దాఖలాలు ఉన్నాయా అంటే అటువంటి సందర్భాలు కన్పించవు. అసలు స్వర్గం - నరకం అనేవి భ్రమలుగానే ఉంటున్నాయి.

కేవలం సామాన్య ప్రజానీకంలో ఆశలు రేకెత్తించి వారి ఆలోచనలను మళ్ళించి తమ ఉనికిని చాటుకోవడం కోసమే ఇటువంటి ప్రచారాలు చేస్తున్నారని స్పష్టం అవుతోంది.

**ఉపనిషత్తులు, పురాణాలు**

కాలం మారుతూ ఉంటే ఆచార, వ్యవహారాలు, నాగరికతల్లో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పురాతన కాలంలోనే వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు వంటివి అన్ని కాలాలకు పనికి వచ్చే రీతిలో రాశారని పలువురి వాదన.

కాగితాలు, కలాలు తెలియని రోజుల్లో నివసించిన ప్రజల్లో మేధావులు ఉండడం సహజం. అయితే కాలం గడిచే కొలది మానవ సమాజంలో మేధావులు మరింత మేలైన రీతిలో రచనలు చేస్తున్న విషయం విస్మరించకూడదు.

పురాతన కాలంలో జనానికి నీతి నియమాలు బోధిస్తూ, ప్రదర్శించడానికి, ఆనందించడానికి అనువుగా రామాయణ, భారతాలను ఆధారం చేసుకుని అనేక కళారూపాలను కళాకారులు ప్రదర్శించేవారు. ఈ కళాకారులు వారి వారి ప్రదర్శనా నైపుణ్యం పెంచుకుంటూ రావడం వల్ల మన దేశంలో రామాయణ, భారత, భాగవతాలు ప్రజల్లో బాగా వ్యాపించి గొప్ప గ్రంథాలుగా ముద్రలు వేసుకున్నాయి.

ఇప్పుడు కూడా విశిష్ట రచనలు చేసే మేధావులున్నారు. కాని ప్రచార సాధనాలు పెరగడంతో అందరి రచనలు ప్రజల్లోకి సులువుగా వెడుతున్నాయి. ప్రత్యేకించి ఫలానా రచన బాగుందని దానిని బాగా ప్రచారం చేయాలనే సంస్కృతి కనుమరుగయ్యిందని అంటున్నారు కొంతమంది విశ్లేషకులు.

## పెరిగిన జనాభా - తరిగిన ఐక్యత

ఇంతవరకు మానవ దృష్టికి వచ్చిన జీవరాశిలో 'మానవుడు' మాత్రమే బుద్ధి జీవి. ఇతర గ్రహాలపై జీవరాశి వున్న జాడలు ఇంతవరకు స్పష్టంగా నిర్ధారణ కాలేదు.

జీవరాశిలో ఒకడైన మానవుడు ఈ భూగోళం పై ప్రకృతి ప్రసాదించిన వనరులను వినియోగించుకోవడం మొదలు పెట్టాడు. పరస్పరం ఆలోచించుకుంటూ, కొత్త కొత్త విధానాలు రూపొందిస్తూ జీవన విధానంలో ఎంతో మార్పులు మేలుగా తీసుకురాగలిగాడు. మానవ శక్తి సామర్థ్యాలు పెరుగుతూ ఉంటే మతాలు, కులాల, వంటివి చోటు చేసుకుని మనుషులు ఆస్తులు, ఐశ్వర్యం అధికారాల కోసం మనుషుల్ని పలు రకాలుగా వినియోగించుకోవడం మొదలయ్యింది.

వీటన్నిటి ఫలితంగా అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, మోసాలు, దొంగతనాల వంటివి మొదలయ్యాయి. చివరకు మనిషికి ప్రాథమిక హక్కు అయిన 'జీవించడం'ను కూడా హరించే పరిస్థితులు మొదలయ్యాయి. అందుకే ప్రతి మానవుడు జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ప్రశాంతంగా జీవించేందుకు కావలసిన పరిస్థితులు నెలకొల్పడం కోసం కృషి చేయాలి.

పెరిగిన జనంతో తరుగుతున్న ఐక్యత గుర్తించాలి. విభజించి పాలించే ఆలోచనలు గలవారి ఆటలు సాగనీయకూడదు. అత్యంత విలువైన మానవ జీవితం విలువను మరింత పెంచుకునే విధంగా తోటి మానవులకు సహాయం చెయ్యాలనే ధోరణి బాగా అభివృద్ధి చెందించుకోవాలి.

శ్రమిస్తూ, శ్రద్ధగా ఆలోచనలతో కృషి చేస్తూ మానవ జాతికి కావలసిన ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసే వారందరిని మనం గమనించాలి - గౌరవించాలి.

## ప్రేమాభిమానాలు మరువకూడదు

మనకు కావలసిన అన్ని రకాల ఆహారాలను సమీకృతంగా తయారు చేసి భుజించేందుకు అనుకూలంగా చేసి సరియైన సమయంలో ప్రేమాభిమానాలతో వడ్డించే తల్లి, చెల్లి, భార్య, పనివారలయినా సరే వారిని ప్రేమాభిమానాలతో చూడాలి.

సమస్త ప్రచార సాధనాలు మూఢ నమ్మకాలను విడనాడమని ప్రభోదిస్తున్నాయి. విచిత్రం ఏమిటంటే ఇలా ప్రభోదిస్తున్న ప్రచార సాధనాలే మహత్యాలు వున్నాయని, అతీత శక్తులు గలవారు సమాజంలో ఉన్నారని ప్రచారం చేయడం జరుగుతోంది. ఇది ఎంతవరకు సబబుగా ఉంది? అని ప్రశ్నించేవారు ఎందరో వున్నారు. కొంచెం ఆలోచించండి. పూజలు, పునస్కారాలు చేసినవారు చేయనివారికంటే సుఖమయ జీవితం సాగిస్తూ ఎక్కువ కాలం జీవించినట్లు ఎక్కడైనా నమోదు అయ్యిందా?

పూజలు, పునస్కారాలు, దైవదర్శనాలు, తీర్థయాత్రలు చేయనివారు జీవితంలో అవస్థలు పడుతూ సుఖమయ జీవితానికి దూరంగా వున్నట్లు స్పష్టమైన ఆధారాలు ఏమైనా వున్నాయా?

పాఠకుల దృష్టికి తీసుకురాదలచిన ముఖ్యమైన అంశం- మీకున్న ప్రతిభను, సమయాన్ని సద్వినియోగ పరచుకుంటూ సమాజ ప్రగతి కోసం వినియోగించండి. కనబడని వారికోసం ఏదో చేయడం కన్నా ఎదురుగా కనబడే మానవులకు సేవచేయండి అనేది మా విన్నపము.

# ఆయుర్వేద కామశాస్త్రాలపై
# తంత్రశాస్త్ర ప్రభావం

- భాగవతము రామారావు

భారతదేశంలో అత్యంత ప్రాచీన కాలం నుండి ఆయుర్వేదం, కామశాస్త్రం అత్యున్నత స్థితిలో ఉన్నసంగతి సర్వవిదితం. కామశాస్త్ర వాఙ్మయంలో వాత్స్యాయనుని కామసూత్రాలకు ఒక విశిష్టమైన స్థానమున్నది. కళ్యాణమల్లుడు వ్రాసిన అనంగరంగమనే కామశాస్త్ర గ్రంథానికి వ్రాసిన ఉపోద్ఘాతంలో కన్నెత్‌వాకర్ భారతీయ సమాజంలో స్త్రీ పురుష సంబంధాలను సశాస్త్రీయంగా విశ్లేషించిన గ్రంథం కామసూత్రాలని ప్రశంసించాడు[1]. వాత్స్యాయనుడు తాను వర్ణించిన కామ (లైంగిక) కార్య కలాపాలన్నిటిని పాటించమని గాని ఆచరించమనిగాని చెప్పలేదు. కొన్నింటిని ఆరోగ్యకరమైన వాటినిగా కాక విశృంఖల కార్యకలాపాలుగా గర్హించాడు[2]. ఈ నాటి సమాజానికి, వాత్స్యాయనుని కాలం నాటి సమాజానికి ఎంతో భేదం ఉన్నా[3], లైంగిక కార్యకలాపాల్లోను, మనస్తత్త్వంలోను పెద్ద భేదం లేదని కూడా వాకర్ పేర్కొన్నారు[4].

నాగార్జునుడు రచించిన కచ్ఛపుటతంత్రం, రసేంద్రమంగళం వంటి ఆయుర్వేద గ్రంథాల్లో తంత్రశాస్త్ర ప్రభావం ప్రస్ఫుటంగా కనబడుతుంది. వశీకరణం, మారణం, స్తంభనం, మొదలైన తాంత్రిక ప్రయోగాలు వీటిలో కనబడుతాయి. తొమ్మిదవ శతాబ్దంలో మాహుకునిచే ప్రాకృతంలో రచింపబడ్డ 'హరమేఖల' గ్రంథంలో ఇట్లాంటి ప్రయోగాలెన్నో ఉన్నాయి. అంధత్వం, మూగతనం, చెముడు, చర్మరోగాలు, మూత్రం అడ్డగించటం వంటి ప్రయోగాలిందులో ఉన్నాయి. చేతబడి లాంటి ప్రయోగం 'పుత్తలికా పంచవింశతి' అనే ప్రయోగం కూడా ఉంది. అవన్నీ ఇపుడు ఆచరణసాధ్యం కానేది వేరే విషయం.

ఆహార, నిద్రా, భయ, మైథునాలు మానవులకు, జంతువులకు సమానమన్నది నానుడి. కామేచ్ఛ ఆకలి దప్పులవలె సహజమైనదని వాత్స్యాయనుడు పేర్కొన్నాడు[5]. ఇతర జంతువుల సంగతి ఏమైనా మానవుల విషయంలో కామేచ్ఛను పూర్తిగా అనుభవానికి తెచ్చుకోవటంలో గుహ్యాంగాలతో పాటు, పెదవులు, స్తనములు మున్నగు వాటికి కూడా ఎంతో ప్రాధాన్యమున్నది. వీటన్నింటి వివరాలు అనగా వాటి నిర్మాణం, విధులు, రోగాలు ఆయుర్వేదంలోను, వాటి వర్ణనతోపాటు లైంగికానందంలో వాటి పాత్ర, ఉపయోగాలు కామ శాస్త్రంలోను వివరించటం తప్పనిసరే. అయితే స్త్రీ గుహ్యాంగమును గూర్చిన వివరాలు పేర్కొనబడకపోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. శవచ్ఛేదాన్ని కూడా వివరించి, శారీర స్థానంలో ఆనాటి పరిస్థితులను బట్టి ఎంతో వివరంగా శరీర నిర్మాణాన్ని వర్ణించిన సుశ్రుతుడు స్త్రీ బాహ్యయోని వర్ణన వివరంగా చేయకపోవటానికి కారణం వాటిపై కొంత న్యూనతా భావం తప్ప అజ్ఞానం అని అనుకోలేము. పై పెదవులు, లోపెదవులు, యోనిచ్ఛత్రము (క్లైటోరిస్), యోని మార్గం (ద్వారం), హైమెడ్ (కన్నెపొర) వీటన్నింటికి ఆనందానుభూతిలో ఉన్న పాత్ర కామశాస్త్రంలోను,

---

భాగవతము రామారావు, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ మెడిసిన్ బులెటెన్‌కు పూర్వ సంపాదకులు. హైదరాబాద్.

ఆయుర్వేదంలోను పేర్కొనకపోవటం ఆధ్యాత్మిక ప్రాముఖ్యం ఎక్కువగా ఉన్న మన సంస్కృతి మూలంగా కావచ్చు).

వాత్స్యాయనుడు కూడ ఈ భాగాలను వివరించలేదు. ప్రథమ సమాగంనాడు పురుషుడు ఎంతో నిగ్రహంగా ఉండాలని, దూకుడుగా నుండరాదని, స్త్రీని మృదువుగా లాలించి రతి జరపాలని పేర్కొన్నాడు[6]. దానికి స్త్రీలు చాల బిడియం, భయం కలిగి ఉంటారని అన్నాడు. కాని ప్రథమ సమాగమంలో స్త్రీయోని మార్గంపై పొర చిట్లడం గురించికాని, రక్తస్రావం జరుగుతుందనికాని చెప్పలేదు. ఆయుర్వేదంలో 'రాత్రిచర్య'లో స్త్రీ సంభోగాన్ని గురించి వివరించారు కాని ఈ విషయాలు పేర్కొనలేదు. అత్యంత ప్రాచీన కాలంలో స్త్రీయోనిలోని ఈ విభిన్న భాగాల అవగాహన లేదనలేము. ఈజిప్టు మున్నగు ఆఫ్రికా దేశాలలో స్త్రీలకు కూడా సున్తీ చేయటం చాల ప్రాచీన కాలం నుండి ఈనాటికి కూడా ఆచరణలో ఉన్నది. స్త్రీలకు సున్తీలో యోని శీర్షం లేదా భగచ్ఛత్రాన్ని (క్లైటోరిస్‌ను) తొలగించేవారు. మన దేశంలోనూ మొదటి రాత్రి మరునాడు రక్తసిక్తమైన వస్త్రాన్ని చూడటం, తద్వారా స్త్రీ అప్పటిదాకా అనాఘ్రాతమైనదని, కన్యయని తెలియచెప్పే ఆచారం కూడా ఉండేది.

సంస్కృతంలో విస్తృతంగా వ్యవహరింపబడుతున్న 'యోని' అనే పదం ఒకే భాగానికి పరిమితమైలేదు. సందర్భాన్నిబట్టి యోనిద్వారానికి, మార్గానికి లేదా అన్నింటికి కలిపి తెలియచెప్పేదిగా వాడబడుతున్నది. మదనాళపత్రం, మదనచ్ఛత్రం అనే పదాలు క్లైటోరిస్‌ను చెప్పటానికి మధ్యయుగం తర్వాత అంటే తంత్రశాస్త్రం బాగా అభివృద్ధి చెందిన తర్వాతి కామశాస్త్ర గ్రంథాల్లో కనబడుతున్నాయి. వేదవాఙ్మయంలో యోని భాగాలు పేర్కొన్నారని కొందరు వివరిస్తున్నారు. శ్రీవాస్తవగారు వేదాల్లో ఈ క్రిందిపదాలకు ఈ విధంగా వివరణ ఇచ్చారు.

శేఫం = స్తంభించిన లింగం (పురుషాంగం); అధిషవణం = కన్నెపొర (హైమెడ్)
భగం = భగచ్ఛత్రం (క్లైటోరిస్); యోని = యోనిమార్గం
ఉపస్థి = యోని; ముష్కెపై = పెదవులు, లోపెదవులు (లేబియా)[7].

ఈ అర్థాలు అందరికీ ఆమోద యోగ్యంగా లేవు. అందునా భగమనే పదానికి యోని శీర్షం లేదా క్లైటోరిస్ అనే అర్థం చెప్పటం విడ్డూరంగా ఉంది.

అనంగరంగంలో (16వ శతాబ్దం) యోని స్వరూపాన్ని వర్ణించే ఆరు శ్లోకాలున్నాయి. యోని నాల్గు రకాలుగా వుంటుందని వర్ణింపబడింది. యోనిలో ఒక నాడి ఉన్నదని అది కామాంకుశంవలే (పురుషాంగం) ఉంటుందని పేర్కొన్నాడు. ఇది మన్మథచ్ఛత్రమని యోని ద్వారానికి పైభాగంలో ఉంటుందని అన్నాడు. యోని మధ్యభాగంలో 'పూర్ణచంద్ర' మనే నాడి ఉంటుంది. స్త్రీలకు మొదటి రతిలో చాల ఆలస్యంగాను, తర్వాత తొందరగాను ఆనందానుభూతి కలుగుతుంది[8]. ఇది మొదటి రాత్రి యోని పొరచిట్లటం వలన కలిగే బాధను, ఆ తర్వాత ఆబాధ లేక పోవటాన్ని దృష్టిలో పెట్టుకొని చెప్పి ఉండాలి.

పదునారవ శతాబ్దానికే చెందిన ఆయుర్వేద గ్రంథం, భావప్రకాశంలో గూడ కొంత వివరమైన యోని వర్ణన ఉన్నది.

‘‘స్త్రీల యోనిముఖంలో మూడు నాడులున్నాయి. సమీరణ, చాంద్రమసి, గౌరి అని వాటి పేర్లు. సమీరణ చాల ముఖ్యమైనది, ఇక్కడపడిన వీర్యం వృథా అవుతుంది. చాంద్రమసి వద్ద పడిన వీర్యం గర్భానికి, స్త్రీ సంతానానికి కారణమౌతుంది. ఇది తొందరగా ఆనందాన్ని కలిగిస్తుంది. గౌరి యోనిలోపలి భాగంలో ఉంటుంది. ఇక్కడ పడిన వీర్యం పురుషసంతానాన్నిస్తుంది’’. వీటి అర్థాన్ని వివరించలేకపోయినా గౌరి అనే నాడి యోని అంతర్భాగంలో ఉండటాన్ని బట్టి కన్నె పొరచిట్లి పురుషాంగం సంపూర్ణంగా ప్రవేశించటాన్ని సూచిస్తుందనుకోవచ్చు. గౌరి అనేపదానికి కన్య (పురుష సంపర్కాన్ని పొందని స్త్రీ) అనే అర్థం కూడ ఉన్నది. ఈ ‘గౌరి’ నాడిననుసరించి ఆ అర్థంవచ్చి ఉంటుందేమో!

అనంగరంగం తర్వాత చిన్న చిన్న గ్రంథాలు కామశాస్త్రంపై చాలా వ్రాయబడ్డాయి. వీటిలో పైనాడుల గురించి, భగచ్ఛత్రం, కన్నెపొర చిట్లటం గురించి పేర్కొనబడింది. అయితే యోని, మదనచ్ఛత్రం, మదనాళపత్రం అనే మాటలు ప్రత్యేకంగా కాక కలగలుపుగా వాడటం కూడా జరిగింది. (ఆళపత్రం, ఛత్రం అంటే గొడుగు. యోని శీర్షం లేదా క్లైటోరిస్ మూసిన గొడుగు ఆకారంలో ఉంటుంది, కాబట్టి ఈ పదం వాడబడింది). కొక్కోకుని రతిరహస్యానికి వ్యాఖ్య రచించిన కాంచీనాథుడు కామాతపత్రమనే పదం యోనికి పర్యాయంగా వాడబడిందని చెప్పాడు[10]. యోనిలోని విభిన్న భాగాల వర్ణన అవగాహన తంత్రశాస్త్ర ప్రభావం వల్ల కలిగి ఉంటుంది. తొమ్మిదవ శతాబ్దంలోనూ, అంతకు ముందు కూడా మొగ్గదొడగిన తంత్రశాస్త్రం తర్వాత బాగా విస్తరించింది. శాక్తేయంలోని వామాచార సంప్రదాయంలో ఎన్నో విభిన్నమైన పద్ధతులు, ప్రయోగాలు ఆచరణలోనికి వచ్చాయి. క్షపణకులు, కాపాలికులు మున్నగువారు యోనిపూజ చేయటం, పంచమకారములను పాటించటం విస్తరిల్లింది. మద్యం, మత్స్యం (చేపలు), మాంసం, ముద్రలు, మైథునం అనే ఈ అయిదు (మకారంతో ప్రారంభమయ్యేవి) నిత్యం వాడుకలో ఉండేవి. అయితే ఈ పూజా కార్యక్రమాలను, పద్ధతులను వివరించే గ్రంథాలేవీ లభ్యం కాలేదు. శాక్తేయ సంప్రదాయంలో ధురంధరులైన వారు ఇవన్నీ సంప్రదాయంగా వచ్చినవని గ్రంథస్థమైనవి కావని చెప్పటం జరిగింది.

శాక్తసంప్రదాయంలో ‘త్రికోణం’ దేవతాచిహ్నం. కౌళులు మొదలగు సంప్రదాయాలకు చెందిన వారు త్రికోణాన్ని లేదా బిందువున్న త్రికోణాన్ని ఆరాధిస్తారు. శ్రీచక్రంలో గూడ బిందు సహిత త్రికోణం ఉండి దాని చుట్టూ షట్కోణం, అష్టదళపద్మం మొదలైనవి ఉండటం అందరెరిగినదే. త్రికోణమనే పదానికి యోని అనే అర్థంలో గూడ వ్యవహారమున్నది. మామూలు స్థితిలో కూర్చొని ఉన్నా, నిలబడి ఉన్నా స్త్రీ యోని భాగం త్రికోణాకారంగానే ఉంటుంది. పై పెదవులను (లేబియా మెజోరా- బృహద్భగోష్ఠములు) ప్రక్కకు తొలగించినపుడే భగచ్ఛత్రం మొదలైన భాగాలు కనబడుతాయి. అందుకే విప్రనారాయణ చరిత్ర, అహల్యా సంక్రందనం లాంటి కావ్యాల్లో ఉన్న యోని వర్ణన త్రికోణంగానే ఉంది. అర్వాచీనమైన చంద్రరేఖా విలాపమనే కావ్యంలో మాత్రం యోని భాగాలన్నింటితో పాటు వాటి విధులు గూడ వర్ణింపబడినాయి. శాక్త గ్రంథాల్లో కొన్నిచోట్ల ఈ

వర్ణనలున్నవి. సౌందర్యలహరికి తెలుగులో వ్యాఖ్యానం వ్రాసిన సంగ శేషాచలశాస్త్రి, తుమ్మలపల్లి రామలింగేశ్వరరావుల ఈ క్రింది వివరణ గమనించదగినది.

''ఆధారచక్రానికి మూడు కోణములు, మధ్యలో బిందువు ఉంటాయి. కౌళులు త్రికోణాన్నే బిందువుగా భావించి ఆరాధన చేస్తారు. పూర్వకౌళులు యోనిని లేదా త్రికోణాన్ని భూర్జపత్రంపై వ్రాసి పూజిస్తే ఉత్తరకౌళులు సాక్షాత్తుగా స్త్రీయోనినే ఆరాధిస్తారు. అంతేగాక ఈ పూజను దిగంబరంగా చేస్తారు. స్త్రీయోనినే పూజించినపుడు మన్మథచ్ఛత్రాన్ని బిందువుగా భావన చేస్తారు. మన్మథచత్రం త్రికోణాకారంలో మధ్యభాగాన్నే ఉంటుంది గదా! దిగంబర క్షపణకులు ఊర్ధ్వ త్రికోణారాధనగావిస్తారు (అంటే కోణం పైభాగాన ఉండాలి). ఈ ఆకారం రావటానికి స్త్రీని తలక్రిందులుగా ఉంచి యోని పూజను అనగా ఊర్ధ్వత్రికోణాన్ని - చేయటం కూడ కలదు.''[11]

తుమ్మలపల్లివారు ''మన్మథచ్ఛత్రం యోని మార్గం పైభాగాన సెనగగింజ ప్రమాణంలో నుండే మాంసపేశీభాగమని'' వివరించారు[12]. కామకళావిలాసానికి వ్యాఖ్యానం వ్రాసిన పుణ్యానందుల వారుకూడ కౌళాచారాన్ని అనుసరించేవారు సాక్షాత్తుగా స్త్రీయోనినే ఆరాధిస్తారని పేర్కొన్నారు. వీరు త్రికోణాన్ని స్వాధిష్ఠానమని, యోనిచక్రమని, కుళగృహమని పిలుస్తారు. అందునా త్రికోణాన్ని (యోనిని) శక్తిగా, బిందువును (భగచ్ఛత్రం) శివునిగా పూజిస్తారు[13].

అర్వాచీన మధ్య యుగంలోని ''పౌరూరవమనసిజ సూత్రమనే'' గ్రంథంలో స్వాధిష్ఠానమనే పదాన్ని యోనికి పర్యాయంగా వాడబడుటయేగాక, భగవిదారణాన్ని (కన్నెపొరచిట్లుట) ప్రత్యేకంగా పేర్కొని ఆ విదారణంలో కలిగే ఆనందం బ్రహ్మానందంకంటెగొప్పదని చెప్పబడింది[14]. అంజిని పురుషాంగానికి, ఉదంజని యోనికి పర్యాయాలుగాను, సర్దగ్నది అనే పదాన్ని భగచ్ఛత్రానికి వాడి భగచ్ఛత్రాన్ని 'ఉపస్థేంద్రియ కుసుమం' (యోనిలోనున్న పూవు)గా వర్ణించటం జరిగింది[15].

యోనిభాగాల ప్రసక్తి లేనంతమాత్రాన వాటిని గూర్చిన అవగాహన లేదని అనుకోనవసరం లేదని పైన పేర్కొనటం జరిగింది. తమిళనాడులోని తంజావూరులోని బృహదీశ్వరాలయంలోను, మరికొన్ని చోట్ల 'పాదలాలాటికం' లేక 'పాదతిలకం' అనే నాట్య భంగిమ శిల్పాలున్నవి. ఈ భంగిమలో కుడికాలు పైకెత్తబడి నొసటిని తాకుతుంది. శివపార్వతులకు నాట్యంలో ఎవరు గొప్ప అనే పోటీ జరిగింది. ఎంతసేపైనా ఒకరికొకరు తీసిపోలేదు. చివరకు శివుడు ఈ పాదలాలాటిక భంగిమను పూనటం, అది స్త్రీలకు నిషిద్ధమైనందున పార్వతి చేయలేక పోవటంతో శివుడు విజయుడైనట్లు ఐతిహ్యం. ఈ భంగిమను, ఒక్కసారైనా ఎక్కువసార్లైనా ఆచరించినపుడు స్త్రీలకు భగవిదారణం జరిగే అవకాశమున్నందున నిషేధింపబడినదని విజ్ఞుల అభిప్రాయం.

పైన చెప్పిన విషయాలను బట్టి కౌళులు మొదలైన తాంత్రిక విద్యల నాచరించెడివారలలో ప్రత్యక్ష యోనిపూజ వ్యాప్తిలోనున్నదని తెలుస్తున్నది. దానివలన యోనిభాగాలను వివరంగా చూడటం పరిశీలించటం జరుగుతూ ఉండింది. తాంత్రికుల్లో వైద్యులు, వైద్యుల్లో తాంత్రికులు లేదా వామాచారానుయాయులూ ఉండేవారు. దానిమూలంగా ఈ విషయాలన్నీ ఆయుర్వేదంలోను, కామశాస్త్రంలోను ప్రవేశించి వర్ణింపబడటం జరిగి ఉంటుంది.

## NOTES

1. Walker 1963 p.14.
2. Ibid p.17
3. Ibid p.18
4. Ibid p.19
5. Kamasutra 1856 p.70.
6. Ibid p.606...add
7. Srivastav 1979 p.266
8. Anangaranga 1987 pp. 39-41
9. Bhavaprakasa 1959 p.39
10. Ratirahasya 1994 p.10
11. Saundaryalahari 1915 p.294 and 1995 p. 277 - 279
12. Ibid 1995 p. 279
13. Kamakalavilasa 1959 p. 174
14. Paururava ... 1967 p.7
15. Ibid p.9.

## BIBLIOGRAPHY


1. Anangaranga of Kalyanamalla : Ed. by Ramachandra Jha. Chowkhamba Sanskrit Sansthan, 1987, Varanasi.
2. Bhavaprakasa of Bhavamisra : Telugu translation by M. Venkata Sastry, Panduranga Printing Press, 1959. Vijayawada.
3. Kamakalavilasa of Punyananda : Telugu comm. by Simhambhatla Ramamurti Sastri, V.R. Sastrulu & Sons, 1959, Chennai.
4. Kamasutra of Vatsyayana with Jayamangala comm. : Hindi comm. by Madhavacarya, Gangavisnu Srikrishnadas, Saka 1856, Mumbai.
5. Paururavamanasijasutram of Jayakrsnadiksita : Published as a part of Kamakunjalata, ed. by Dhundhirajasastri, Chowkhamba Sanskrit Series Office, 1967, Varanasi.
6. Ratirahasya of Kokkoka : Ed. with Dipika comm. in Saskrit by Kancinatha and Prakasa comm. in Hindi by Ramananda Sarma, Krishnadas Academy, 1994, Varanasi.
7. Saundaryalahari of Sankaracarya : Telugu comm. by Sanga Seasacalasastri, M.G. Subbaraya Sastri, 1915, Chennai.
8. Saundaryalahari of Sankaracarya : Telugu comm. by Tummalapalli Ramalingesvararao Sastri, Balasarasvati Book Depot, 1995, Chennai.
9. Srivastav, Sureshchandra : Vaidiksahitya mein Janana-mutra-tantra, Ayurved Mahasammelan Patrika, June 1979, pp.261-268.
10. Walker, Kenneth : The Anangaranga of Kalyanamalla and Symposium of Plato, Kulher Pocket Editions, 1963, London.

# ఇతిహాసాల్లో వృత్తి కులాలు

మూలం: అశోక్ కుమార్ మజుందార్ అనువాదం : శివలింగం

అశోక్ కుమార్ మజుందార్ భారతీయ విద్యాభవన్ డైరక్టరుగా పనిచేసి 1972లో రాజీనామా చేశాడు. అనేక గ్రంథాలు రాశాడు. ప్రసిద్ధ చరిత్రకారుడు. ఆర్.సి. మజుందార్‌గారి కుమారుడు. History and Culture of the Indian People సీరీస్‌కు అసిస్టెంటు ఎడిటర్. ఇప్పుడు లేరు. ఇతిహాసాలను పరిశోధించి పుస్తకం రాశారు. Economic Background of The Epic Society. భండార్కార్ ఓరియంట్ ఇన్‌స్టిట్యూట్‌వారు ప్రచురించిన మహా భారతం. G.H. భట్ సంపాదకత్వాన ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్ బరోడా వారు ప్రచురించిన రామాయణం గ్రంథాలను ఉపయోగించుకున్నారు. వారి ఆ గ్రంథంలోనిది ఈ వ్యాసం.

రామాయణంలో వృత్తి కులాలు పేర్కొనకపోయినా అనేక వృత్తులు కనిపిస్తున్నాయి. ఒకే వృత్తికి సంబంధించిన వారంతా ఒక కులంగా ఏర్పడ్డారని చెప్పడం కష్టమే, అయినా అలా జరిగి వుంటుందని ఊహించవచ్చు. దశరథుడు యాగం చేయడానికి నిశ్చయించాడు. యాగం నిర్వహించడానికి కావలసిన కర్మాంతికులు, శిల్పకారులు (కార్మికులు), వర్ధకిలు (వడ్రంగులు), ఖనకానులు (తవ్వేవారు), గణకులు (లెక్కలు రాసేవారు), శిల్పులు, నట, నర్తకులను, పిలిచాడు వశిష్టుడు. రామచంద్రుని కలుసుకోడానికి భరతుడు వెళ్ళినపుడు అయోధ్య పౌరులు ఆయన వెంట వెళ్ళినవారు :

1. మణికారులు, 2. కుంభకారులు, 3. సూత్రకర్మ విశేషజ్ఞులు (వడ్రంగులు, భవన నిర్మాతలు), 4. శాస్త్రోపజీవులు (armourers), 5. మయూరకులు (నెమలి ఈకలతో వివిధ వస్తువులు తయారు చేసేవారు), 6. కాకచికులు, 7. వేధకులు (రత్నాలను గుచ్చేవారు), 8. రోచకులు (కృత్రిమ ఆభరణాలు తయారు చేసేవారు), 9. దంతకారులు, 10. సుధాకారులు (సున్నం వేసేవారు), 11. గంధోపజీవులు, 12. సువర్ణకారులు (కంసాలులు), 13. కంబళధావకులు (తివాచీలు శుభ్రం చేసేవారు, 14. స్నపకోష్ణోదకులు (వేడినీళ్ళు పెట్టేవారు), 15. వైద్యులు, 16. ధూపకులు, 17. సౌండికులు (వైన్ మర్చంట్సు), 18. రజకులు, 19. తున్నవాయకులు (దర్జీలు), 20. గ్రామఘోషులు (డ్రమ్మర్స్), 21. మహత్తరులు (గ్రామపెద్దలు), 22. శైలూషులు (నటులు), 23. కైవర్తకులు (చేపలు పట్టేవారు).

మహాభారతయుద్ధం తరవాత ధృతరాష్ట్రుడు కురుక్షేత్రం వెళ్లేటప్పుడు వారివెంట శిల్పులు, వణిజులు, వైశ్యులు, సర్వకర్మోపజీవులు వున్నారు. వైశ్యులంటే ధాన్యవ్యాపారులు, పాలవ్యాపారులు. వర్ణ సంకరం వల్ల పుట్టిన ఉపకులాలను మహాభారతం పేర్కొన్నది. సూతులు, బందీలు, మాగధులు. మాగధులు ఇతరులను పొగడేవారు. బందీ అంటే ఖైదీ అని అర్థం. వైశ్యునికి క్షత్రియ స్త్రీకి పుట్టిన సంతానం బందీలు, మాగధులు. కర్ణుడు సూతుడు అయినా అంగదేశపు రాజు. క్షత్రియ కుటుంబంలో పుట్టినా, యుద్ధ నిపుణుడైనా, సైన్యాధిపతి అయినా రాజు కావచ్చని దుర్యోధనుడి తీర్పు. సాహసి అయిన సైనికుడి పుట్టుక మూలం తెలుసుకోడం నదీమూలం తెలుసుకోవడం లాంటి కష్టమైన పని అని కర్ణుడన్నాడు. సూతుల హోదా తక్కువది కాదు. అధిరథుడు ధృతరాష్ట్రుని స్నేహితుడు కూడా.

నిషాదులు - పల్లెవారు, తక్షులు - వడ్రంగులు, మైరేయకులు - వైన్ తయారు చేసేవారు, దాసులు - పడవనడిపేవారు, మద్రనాభులు - గాడిదలతో బండ్లను నడిపేవారు, కారావరులు - చర్మకారులు, పాండులు - వెదరుతో వస్తువులు చేసేవారు.

నాపిత (బార్బర్)ను కూడా పేర్కొన్నది. శూద్రుని కన్నా నా పిత హీనుడని కర్ణుడు చెప్పాడు.

---

శివలింగం, చల్లపల్లి

వ్యాధుడు అంటేవేటగాడు. మాసం అమ్మేవాడు, తత్వాన్ని బోధించేవాడుగా మహాభారతం పేర్కొంది. కర్మకారులు చాలాసార్లు కనిపిస్తారు, బాణాలను శుభ్రం చేసేవారు.

ఇతిహాసాలు కులాలు వృత్తుల ఆధారంగా ఏర్పడినాయన్న భావాన్ని లోతైన అన్వేషణ చేయలేదు. ధర్మ శాస్త్రాలు, వేదాలు ఆధారం చేసుకుని పరిశీలించినా ఇతిహాస యుగానికి పరిస్థితులు భిన్నంగా కనబడవు.

వాప్తృ (బార్బర్), త్వష్టృ (వడ్రంగి), తక్షణ్ (వడ్రంగి), భిషజ్ (వైద్యుడు), కర్మకార (కంసాలి), చర్మామ్న (చర్మకారుడు) మొదలైన పదాలు ఋగ్వేదంలో కనిపిస్తున్నాయి.

అయస్- లోహం అయస్తాప వాజసనేయి సంహిత.
రధకార, కర్మార, సూత - అధర్వవేద

తక్షన్, రధకార, కులాల, కర్మార, పుంజిష్ట, నిషాద, ఇషుకృత్ ( బాణాలు తయారు చేసేవాడు), ధనవకృత్ ( విల్లు తయారు చేసేవాడు) - తైత్తరీయ సంహిత

తైత్తరీయ బ్రాహ్మణంలో పేర్కొనబడిన ఇతర వృత్తులవారు :

మగధ, సూత, శైలూష, రధకార, తక్షన్, కౌలాల, కర్మార, మణికార, వప, ఇషుకార, ధనవకార, జ్యాకార, రజ్జు సర్జ, సురాకార, అయస్తాప, బిడలకార.

ఈ వృత్తుల్లో కర్మార, తక్ష, మగధ, సూత, నిషాద వృత్తులు మహాభారతంలో వున్నాయి. వేద కాలంలో కులాలుగా ఏర్పడ్డారో లేదో కాని మహాభారతకాలానికి కులాలుగా వున్నాయని నిస్సందేహంగా చెప్పవచ్చు.

**ధర్మశాస్త్రాల్లో వృత్తి కులాలు కనుగొనవచ్చు, అవి:**

అయస్కార, కర్మకార, కాంస్యకార, కులాల, కుశీలవ, చర్మకార, తక్ష, తంతువాయ, దాస, ధీవర, నట, నాపిత, మణికార, మగధ, మాలాకార, రజక, రంజక ( రంగులద్దేవాడు), లుబ్ధక, లోహకార, శైలూష, సువర్ణకార, సూత.

మహాభారతం కులాల, తంతువాయ, మణికార, రంజక వృత్తులు తప్ప మిగతావారందరినీ చేర్చింది. వీరంతా వర్ణసంకరం వలన శూద్రులుగానే భావించారు. ధర్మశాస్త్రకర్తలు బ్రాహ్మణులు కావడంవలన కులాలు ఉపకులాలనుగురించి వారికి సరిగా తెలియదు. మొత్తం ఉపకులాలు 200కు మించడంలేదు. విల్సన్ భారతీయ కులాలు Vol. 1 లో 134గా చెప్పాడు. సంస్కృత, మరాఠీ గ్రంథాలు జాతి వివేక, మాధవ కల్పలత, పరశురామ ప్రతాపవంటివాటి ఆధారంగా, మహాభారతం పదిహేను వర్ణ సంకరాలను మాత్రమే పేర్కొన్నది. ఏదైనా కొత్త పరిశ్రమ అభివృద్ధి చెందినపుడు శూద్రులు దాన్ని స్వీకరించవచ్చని మనువు.

కారు అంటే వంట, నేత, వడ్రంగం అని, శిల్పం అంటే చిత్రలేఖనం అని అర్థాలు చెప్పాడు మేధాతిథి. చేతివృత్తులన్నీ శూద్రులు చేసేవి. ఇతరులు చేసేవి కావు.

వాయు పురాణం, శంఖస్మృతి వంటి తరవాత వచ్చిన గ్రంథాల్లో శూద్రులు బ్రాహ్మణులకు సేవ చేయడం లేదా ఏదో వృత్తిని ఆశ్రయించడంగా పేర్కొన్నాయి.

వృత్తి ( జీవిక అని నీలకంఠ అనగా means of livelyhood or craft).

ఏ వృత్తిలేని శూద్రులు బ్రాహ్మణులకు సేవ చేయాలి.

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల వృత్తులు నిశ్చయించబడినాయి. వృత్తులు క్రమ పరిణామంతో అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ధర్మశాస్త్రకారులైన బ్రాహ్మణులు పరిస్థితులను, సాంఘిక ప్రగతిని గమనించారు.

సాంకేతిక నిపుణులు, సమాజాభివృద్ధికి కారకులు అయిన శూద్రులను సమాజంలో పైకి రానీయకుండా హీన స్థితిలో వుంచడానికి ప్రయత్నించారు. ప్రథమంలో ఈ శిల్పులు సామాజిక అవమానానికి గురై బాధపడినట్టు కనిపించలేదు. శూద్రుల సామాజిక స్థితి ఇతిహాస కాలంలో కొంతమేలు. వైశ్యులు ధనాన్ని అప్పుగా యిచ్చేవారు. ఆర్థిక రంగంవారిదే, గుత్త పెట్టుబడిదారులు. శూద్రులు లేకపోతే సమాజమూ లేదు, పరిశ్రమలూ లేవు.

సమాజాభివృద్ధికి మూలం శూద్రులు. సామాజిక చలనం ఆర్థికంగా బలపడినపుడే పైకి వెళ్ళగలిగేది. ఆనాడు ధనికులైన శూద్రులు లేక పోవడానికి కారణం ధర్మశాస్త్ర నిబంధనలు. పాలకవర్గం సమాజ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలైన క్రింది కులాలవారిని అణగదొక్కినారనడం సత్యదూరం కాదు.

మహాభారతంలో వైద్య వృత్తిని గురించిన కొన్ని వివరాలు కనిపిస్తున్నాయి. మామగారి ఆస్తి మీద లేదా భార్య సంపాదన మీద బతికేవారితో సమానులే వైద్యులు. బ్రాహ్మణులు వైద్యులు కాకూడదు. వారు ఆయుర్వేద శాస్త్ర బోధకులేగాని ప్రాక్టీస్ చేయకూడదు. వైద్య వృత్తి శైత్యతను తెలుపుతుంది. విదురుడు సాక్ష్యానికి అనర్హులుగా పేర్కొన్న వారిలో వైద్యుడున్నాడు - హస్తసాముద్రికుడు, అక్రమ వ్యాపారి, జూదరి, వైద్యుడు. స్నేహితుడు, శత్రువు, నర్తకుడు, దొంగ, క్రూరుడు, తాగుబోతు, భ్రూణ హంతకులు, సేనా జీవులు, వేదాలు అమ్మేవాడు - వీరంతా సాక్ష్యానికి అనర్హులు. ఆయుర్వేదం చదివినవాడు వైద్యుడు. వైద్యవృత్తి చేసేవాడు చికిత్సకుడు. రసాయన శాస్త్రం చదివినవాడు రసాయన వైద్యుడు.

వైద్యులు ఫీజు వసూలు చేసినట్టు ఖచ్చితమైన సాక్ష్యం వుంది. సంజయుడు చెప్పాడు. కురుక్షేత్ర యుద్ధంలో భీష్ముడు తీవ్రగాయాలతో పడి పోయినపుడు నిపుణులైన వైద్యుల్ని రప్పించారు. అప్పుడు భీష్ముడు వారికి ఫీజు ( దత్త్వా దేయ) యిచ్చి పంపమని దుర్యోధనునితో చెప్పాడు. చెల్లించాడు.

వ్యాధిభిర్ మధ్యమానానాం
త్యజతాం విపులంధనం
వేదనాం న ఆపకర్షంతి
యతమానాశ్చికిత్సకః

ప్రజలు వ్యాధితో తీవ్ర బాధుపడుతుంటారు. ధనాన్ని త్యజించినా వైద్యులు వారి బాధను పోగొట్టరు. పక్షులు, జంతువులు, పేదవాళ్ళు వైద్యానికి నోచుకోలేరు. వైద్యులు వృత్తిని దుర్వినియోగం చేయడంవలన మనువు వారిని శీలవతులు కాని స్త్రీలతోను, వడ్డీవ్యాపారస్తులతోనూ కలిపాడు. వైద్య శాస్త్రం అభివృద్ధి చెందింది. అష్టాంగ చికిత్స పేర్కొనబడింది.

1. ద్రవ్యాభిధాన - (Lexicon of Drugs), 2. గదనిశ్చయ - (Diagnosis), 3. కాయ సౌఖ్య - (body health), 4. శల్యాది - (Surgery), 5. భూత నిగ్రహ - (Supression of evil spirits), 6. విష నిగ్రహ - (Treatment of poisons), 7. బాల వైద్యక - (Treatment of childrens disease), 8. రసాయన - (Chemistry).

బాల వైద్యక అంటే గైనకాలజి కావచ్చు. పరీక్షితుని జనన సమయంలో ఉత్తర వైద్య నిపుణుని కోసం వేచి చూస్తుంది. Uterine ఆపరేషన్సుకూడా చేసేవారు. కషాయాలు, మూలికలు ఉపయోగించేవారు. మానసిక రోగులకు సుగంధాలు, కాటుక, నశ్యం మందులు వాడేవారు. తలనొప్పి, కంటి జబ్బులు, పళ్ళ నొప్పి, జలోదర, జ్వరగండ, కలరా, కుష్టు మూర్ఛ వంటి వ్యాధులుండేవి. మలేరియా జ్వర లక్షణాలు వర్ణించబడినాయి.

**పాక శాస్త్రజ్ఞులు**

క్షత్రియులు గాని, వైశ్యులు గాని వంట చేయటానికి అర్హులు. బ్రాహ్మణులకు ఆహారం వడ్డించేది వైశ్యులే. విరాటుని కొలువులో భీముడు వంటలవాడుగా చేరినపుడు కులం అడిగారు. ధృతరాష్ట్రుని వంటశాలలో ప్రత్యేక నిపుణులుండేవారు. ఆరాలిక, సూపకార, రాగ ఖండవిక వంటివారు. కూరగాయలు కోయటానికి అరా అనే పనిముట్టు వాడేవారు, కనుక ఆరాలిక, కూరగాయలు సిద్ధం చేసేవాడు, సూప్ తయారు చేసేవాడు, స్వీట్స్ తయారు చేసేవాడు. మాంసం తయారు చేసేవాడొకడు. ధృతరాష్ట్రుడు మాంసాహారి, మద్యం సేవించేవాడు (పానకానిల ఘూని).

**వినోదాలు**

మహాభారతంలో నటులు, నర్తకులు, వేశ్యలు చాలాచోట్ల కనిపిస్తారు. వేశ్యల్ని, వేశ్యల్ని వుంచుకునేవారిని, జూదరులను కంట్రోల్ చేయమని రాజుకు సలహా యివ్వబడింది. రాజుల చుట్టూ వేశ్యలుండేవారు. యుధిష్ఠిరుడు అశ్వమేధయాగం చేసినపుడు రాజులు స్త్రీలను వెంటతెచ్చారు. రాజుకిచ్చారు. అలాగే యుధిష్ఠిరుడు కూడా వారికి వేశ్యలనిచ్చాడు. అశ్వమేధ యాగంలో తాగుతూ నృత్యాలు చేసేవారు.

మత్తోన్మత్త ప్రముదితం
ప్ర గీత యువతీ జనం

మత్తులైన వారికి ఉల్లాసం కలిగిస్తూ యువతులు పాడుతున్నారు.
అశోకుడు ఇటువంటి సమాజాల్ని నిషేధించాడు.

**శిల్పులు**

ఇతిహాసాల్లో శిల్పుల పని స్వభావాన్ని తెలపడం కనబడుతుంది. యజ్ఞం చేసే ప్రదేశాన్ని సిద్ధం చేయమని వశిష్టుడు శిల్పులకు చెపుతాడు. శిల్పులు యజ్ఞం చేయటానికి కొన్ని నిర్మాణాలు చేయవలసిన అవసరం వుంది. చేసే పనిని బట్టి హోదా. మహా భారతంలో ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి వానప్రస్థాశ్రమంలోకి వెళ్లేటప్పుడు యుధిష్ఠిరుడు చూడాలనుకున్నాడు. సైన్యాన్ని సిద్ధం చేయమని కమాండర్లను ఆదేశించాడు. స్త్రీ అధ్యక్షుని పల్లకీలు సిద్ధం చేయమన్నాడు. వాహనాలు, దుకాణాలు, వేశ్యలు, కోశాగారం, శిల్పులు, కోశపాలురు వెంట రమ్మన్నాడు. ఆ రోజుల్లో రాజు వెంట సైన్యం కూడా నడుస్తూ వుండేది. శిల్పులు శూద్రులేననడంలో సందేహం లేదు.

**స్థపతులు**

భవనాలు నిర్మించేవాడు స్థపతి. రాజసూయయాగంచేసేముందు భీముడు చాలామంది స్థపతుల్ని పిలిపించాడు. స్థపతులకు శిల్పులు సహాయ పడతారు. రాజప్రసాదం నిర్మించారు స్థపతులు. వీరు బ్రాహ్మణులు కారు, బ్రాహ్మణేతరులు, ఎక్కువగా శూద్రులు.

# సమసమాజంలో మానవాత్మ

మూలం : ఆస్కార్ వైల్డ్ అనువాదం : సర్దేశాయి తిరుమల రావు

(గత సంచిక తరువాయి)

జీవ పరిణామం జీవసూత్రం. వ్యక్తిత్వం వైపున పయనించకపోతే జీవ పరిణామమే లేదు. ఈ మొగ్గ ఎచట ప్రకటితం కాలేదో అచట అభివృద్ధి అసహజంగా నిరోధింపబడిందని కానీ, రోగముంది అనికానీ, చావుమూడిందని కానీ అర్థం.

వ్యక్తిత్వం స్వార్థరహితమైంది. దంభమైందికాదు. అధికారపు అసాధారణ నిరంకుశత్వ ఫలితాలలో ఒకటి పదాలకు అపార్థాలు కల్పించి భ్రష్టం చేయడం. కళ యెడల నిజమైనది జీవిత మెడల కూడా నిజమే అవుతుంది. తన ఇష్టంవచ్చినట్లు దుస్తులు ధరించిన వానిని డాంబికుడు అంటుంటారు. కానీ వాడలాగు చేయుట సహజమే. తన పొరుగు వాని అభిప్రాయాల, ప్రకారం దుస్తులు వేసికోవడమే డాంబికమవుతుంది. పొరుగువాని అభిప్రాయాలు, అధిక సంఖ్యాక జనం యొక్క అభిప్రాయాల మాదిరిగానే తెలివిలేనివిగా ఉంటాయి. తన వ్యక్తిత్వాన్ని పూర్తిగా సాధించుకొనే విధంగా జీవించే వానిని స్వార్థపరుడుంటారు. ఇదే కదా వాని జీవిత పరమావధి. తన కిష్టం వచ్చినట్లు తాను బ్రదుకడం స్వార్థం కాదు. ఇతరులను తన ఇష్టం ప్రకారం బ్రదుకుమనడం స్వార్థం. వారి జోలికి పోకుండా ఇతరులను వారి కిష్టం వచ్చినట్లు బ్రదుకనీయడం స్వార్థరాహిత్యం. చుట్టూ అంతా ఒకే మాదిరి వుండవలెననేది స్వార్థం యొక్క ఆశయం. స్వార్థరాహిత్యం వర్గాల అనంతవైవిధ్యం, ముచ్చట గొలిపేది అని స్వార్థరాహిత్యం గుర్తిస్తుంది, ఒప్పుకుంటుంది మననిస్తుంది, ఆనందిస్తుంది, ఎవడంత వాడే ఆలోచించుకొనడం స్వార్థం కాదు. తన భావాలు తాను ఆలోచించనివాడు ఆలోచించని వాడే. తన వలె పొరుగువాడూ ఆలోచించవలెననీ, తన మాదిరి అభిప్రాయాలు కలిగివుండవలెననీ అనుకొనుట మిక్కిలి స్వార్థం. వాడెందుకట్లు చేయవలెను? ఆలోచించడమే చేతనైతే, వేతే విధంగా ఆలోచిస్తాడు. వాడు ఆలోచించలేక పోతే, వాని నుండి ఎలాటి ఆలోచననీ అభిలషించుట ఘోరం. ఒక ఎఱ్ఱగులాబీ ఎఱ్ఱగులాబీగా వుండుట స్వార్థం కాదు. తోటలో ఉండే అన్ని పూలూ ఎఱ్ఱగానూ, గులాబీలగానూ ఉండవలెనని ఇది అనుకోవడం ఘోరమైనస్వార్థం అవుతుంది. వ్యక్తిత్వం క్రింద అందరును సహజంగా, స్వార్థ రహితంగా ఉంటారు. మాటల అర్థంను తెలుసుకొంటారు. వాటిని తమ స్వేచ్ఛాయుత సుందర జీవితాలలో సాధించుకొంటారు. ఇప్పటి వలె అహంకారులుగా ఉండరు. ఇతరులపై అజమాయిషీని కోరేవాడు అహంకారి. వ్యక్తిత్వవాది అలాగు చేయడు. అది వానికానందం కలిగించదు. వ్యక్తిత్వాన్ని సాధించినవాడు సహానుభూతిని సాధించుకొని దానిని స్వచ్ఛందంగా ఆయాచితంగా కనబరుస్తాడు. ఇంతదనుక మనిషి సహానుభూతిని సాధించుకోలేక పోయినాడు. బాధ ఎడల సహాను భూతి ఉంది. బాధ ఎడలగల సహానుభూతి ఉన్నతమైన సహానుభూతికాదు. సహానుభూతి అంతామంచిదే. కానీ బాధపైనున్న సహానుభూతి తక్కువ శ్రేణికి చెందింది. ఇది అహంకార దోషదూషితం. ఇది స్వచ్ఛభావ

---

కీ॥ శే॥ డా॥ సర్దేశాయి తిరుమలరావు, (1928 - 1994) ప్రముఖ సాహిత్య విమర్శకులు

పూరితమూకావచ్చు. మన భద్రతను గుఱించిన భయం ఇందులో ఇమిడివుంది. కుష్ఠు రోగివలె, గ్రుడ్డివానివలె అయి పోతామని ఎవరు మనలని ఆదుకొనరనీ భయపడుతాము. అందుచేత ఇది చాలా పరిమితం అయిపోతుంది. సమగ్ర జీవితం ఎడల సహాను భూతి చూపించవలెను. పుండ్లు, రోగాల ఎడల మాత్రమే కాక జీవితం యొక్క ఆనందం, సౌందర్యం, శక్తి, ఆరోగ్యం, స్వాతంత్ర్యము ఎడలనూ సహానుభూతి కావలెను. సహాను భూతి ఎంత విస్తృతమైతే అంతక్లిష్టమవుతుంది. అప్పుడు దానికి ఇంకా ఎక్కువ స్వార్థరాహిత్యంకావలసి వుంటుంది. స్నేహితుని బాధకెవరైనా సహాను భూతి చూపించగలరు. కాని స్నేహితుడు సాధించిన విజయం ఎడల సహానుభూతి కనబఱచడానికి నిజమైన వ్యక్తిత్వం కావలసి ఉంటుంది.

నేడు స్థానాల కోసం పోటీల, పోరాటాల ఒత్తిడివలన ఇటువంటి సానుభూతి సహజంగా అపురూపంగా కన్పడుతుంది. అంతా ఒకే రకంగా ఉండవలె. నియమాలకి లొంగి ఉండవలె అనే అవినీతికరమైన ఆదర్శంచేత సహానుభూతి అణచి వేయబడుతుంది. ఎక్కడ చూస్తేకూడ ఇట్లే వున్నది. ప్రాయశః ఇంగ్లాండులో మరీ అధ్వాన్నంగా వుంది. బాధల ఎడల సహాను భూతి ఎప్పుడు ఉంటుంది మఱి. అది మానవుని మొదటి నైజం. పై స్థాయి జంతువులు దీనిని మనతో పంచుకొంటాయి. దీనిని జ్ఞప్తిలో నుంచుకొనవలెను. ఆనందంతోడి సహానుభూతివల్ల ప్రపంచంలోని ఆనందం వెరసి ఎక్కువవుతంది. బాధల ఎడల సహాను భూతివల్ల బాధవెరసి తక్కువ కావడంలేదు. సహానుభూతి, కీడును ఓర్చుకొనేటట్లు మనిషిని చేయగలదేమోకాని కీడు మాత్రం అట్లే వుంటుంది. క్షయవ్యాధి ఎడల సానుభూతి క్షయవ్యాధిని నయం చేయదు, ఆపని శాస్త్రం చేస్తుంది. సమసమాజం దారిద్ర్య సమస్యను పరిష్కరించినపుడు ఏడ్పుగొట్టు మొగాలవారి పరిధి తక్కువౌతుంది. మానవుని సానుభూతి ఎక్కువగా, ఆరోగ్యకరంగా, స్వతస్సిద్ధంగా వస్తుంది. ఇతరుల ఆనందమయ జీవనాన్ని ధ్యానించడంలో మనిషికి ఆనందం కలుగుతుంది.

ఆనందంలోనే భవిష్యత్తులోని వ్యక్తిత్వం అభివృద్ధిచెందుతుంది. క్రీస్తు సంఘాన్ని పునర్నిర్మించడానికి ప్రయత్నించలేదు. పర్యవసానంగా ఆయన బోధించిన వ్యక్తితత్వం బాధవల్లనో ఏకాంతంవల్లనో మాత్రమే సాధ్యమయ్యేది. మనం ఏసుక్రీస్తుకు ఋణపడియున్న ఆదర్శాలు, సంఘాన్ని పూర్తిగా ఎదిరించేవాని ఆదర్శాలు. మనిషి సహజంగా సమాజికుడు. థీబ్స్‌వాసులు * కూడ ప్రజలవుతారు. మత సన్యాసీ తన వ్యక్తిత్వాన్ని సాధించుకొన్నా అతనిది పేదవడిన వ్యక్తిత్వం. ఆత్మ సాక్షాత్కార సాధనకి బాధ ఒక పద్ధతి అనే భయంకరమైన సత్యంగా ప్రపంచంపై భయంకర ఆకర్షణను ప్రయోగిస్తున్నది. మిడిమిడి జ్ఞానంకల ఉపన్యాసకులూ, ఆలోచనా పరులూ, మత వేదికల మీద నుండి, సభావేదికల నుండి ప్రపంచంలో ఆనందారాధన ఉందని మాట్లాడు తుంటారు. దాని గుఱించి గొణుగుచుంటారు. ప్రపంచ చరిత్రలో ఆనంద సౌందర్యాలు ఆదర్శంగా ఉండింది

* థీబ్సువాసులు గ్రీకుల బద్ధ శత్రువులు. అయినా కాలక్రమేణా వాళ్ళూ గ్రీకులతో కలసి సామరస్యంతో ఉండిరి.

అరుదే. బాధను ఆరాధించేది ప్రాముఖ్యం కలదిగవుంధి. మధ్యమయుగం తన క్రైస్తవ ఋషులతోనూ, క్రైస్తవ మత విశ్వాసంపై అచంచల విశ్వాసం మూలంగా మరణశిక్ష విధింపబడిన అమరవీరులతోనూ, ఆత్మ హింసపై మోజుతోనూ చాకులతో కోసి కొనుటతోనూ, సెలగోళ్ళతో తమను తాము కొట్టుకొనడంతోనూ ఉండే మధ్యమయుగం ఉందే అదే నిజమైన క్రైస్తవమతం. మధ్యమయుగ క్రీస్తే నిజమైన క్రీస్తు. పునరుజ్జీవన ప్రత్యూషవచ్చి తనతో జీవిత సౌందర్యం, జీవానందం అనే కొత్త ఆదర్శాలు తెచ్చినప్పుడు జనులు క్రీస్తును అర్థం చేసికోలేక పోయినారు. కళకూడ అదే చూపుతుంది. పునరుజ్జీవనోద్యమ చిత్రకారులు క్రీస్తును ఇంకొక పిల్లవానితో తోటలోగానీ, రాజప్రాసాదంలోగానీ, ఆడుకొనే పిల్లవానిగానో, తల్లి అడ్డాలనుండి ఆమెను చూచిగానీ. నవ్వుతుండేవానిగానో లేదా భూతలమందు నడుస్తూవుండే గంభీరాకారంగానో, లేదా మృత్యువునుండి అమృత్వానికి ఆనందపారవశ్యంతో లేచే అద్భుతాకారంగానే చిత్రించినారు. శిలువపైనున్నట్లు చిత్రించినప్పుడుకూడా, దుర్మార్గులు బాధ విధించిన సుందర దైవంగా చిత్రించినారు. ఆయన అంటే ఆ కళాకారులంత పట్టించుకోలేదు. వారికానందం కల్గించిందెల్లా, తాము మెచ్చుకొనే స్త్రీ పురుషులను చిత్రించడము, ఈ భూమి అందాన్ని చూపించడమూను. వారు చాలా మతసంబంధ చిత్రాలు వేసినారు. ఎంతగా వేసినారంటే ఆకృతిలోనూ, ఆశయంలోనూ విసుగెత్తించేంత వేసినారు. ఆదికళకు చెడుగు, కళా విషయాలలో ప్రజల అధికార ఫలితమది, ఇది శోచనీయం. వారి ఆత్మ, ఇతివృత్తం మీదవుంటే కదా! పోపు చిత్రాన్ని వేసినపుడు రాఫేలు గొప్ప చిత్రకారుడు. మేరీమాతల, బాలక్రీస్తుల చిత్రాలు వేసినపుడు గొప్ప చిత్రకారుడుకానే కాదు. పునరుజ్జీవనానికి క్రీస్తు ఇచ్చే సందేశంలేదు. ఎందుకంటే అది ఆయన ఆదర్శానికి భిన్నమైన దానిని తెచ్చింది. నిజమైన క్రీస్తు ప్రదర్శన కోసమై మనం మధ్యమ యుగపు కళద్గరికి పోవలెను. అచట అతడు కాళ్ళు చేతులు విఱుగగొట్టబడిన వాడు, చెడగొట్టబడినవాడు. ఎందుకంటే అందం, ఆనందం కాబట్టి. మంచివుడుపులలో లేనివాడు. అదీ ఆనందం కావచ్చు. అద్భుతమైన ఆత్మగల బిచ్చగాడు. దైవాంశతోడి ఆత్మగల కుష్ఠురోగి. అతనికి ఆస్తీవద్దూ, ఆరోగ్యమూ వద్దు, అతడు బాధ ద్వారా నిజపరిపూర్ణతను సాధించుకొనే దేవుడు.

మానవ పరిణామం ఆలస్యంగా వస్తుంది. మనుషులకు జరిగే అన్యాయం ఎంతో వుంటుంది. ఆత్మ సాక్షాత్కార సాధనకు బాధను ఒక పద్ధతిగా ప్రతిపాదించుట ఆవశ్యంగా ఉండింది. ఇప్పటికి ప్రపంచంలోని కొన్ని ప్రదేశాలలో క్రీస్తు సందేశం అవసరం. నేటి రష్యాలో నివసించే వాడెవడు కూడా బాధద్వారా తప్ప వేఱే విధంగా ఆత్మ పరిపూర్ణతను పొందలేడు. *కొందరు రష్యన్ కళాకారులు ఆవిధంగా తమను తాము తెలిసికోగలిగినారు. **వేదన ద్వారా తమను తాము తెలిసికోవడం మధ్యమయుగ నవలలో ప్రధాన లక్షణం. అటువంటి నవలలో తమను తాము తెలిసికోగలిగినారు ఈ కళాకారులు. ***కళాకారులు కానివారికి, వాస్తవిక జీవితంకాక వేఱేరీతి జీవితంలేనివారికి,

* డాస్టవస్కీ లాంటి వారిని గురించి చెప్పుతున్నాడు.
** దోస్తవస్కీ అటువంటి నవలాకారుడు.
*** నిహిలిస్టు

పరిపూర్ణతకు బాధయేదారి. రష్యాలో ప్రస్తుత ప్రభుత్వ విధానంలో ఆనందంగా జీవించేవానికి, ఆత్మలేదనన్నా అనుకోవలె. ఒక వేళ ఉన్నా, అది అభివృద్ధికి పనికిరానిదనైనా అనుకోవలె. అధికారం చెడ్డది కావున సర్వమైన అధికారాన్నీ తిరస్కరించిన నాస్తికవాది* బాధను ఆహ్వానిస్తాడు. ఎందుకంటే దానిద్వారానే తన వ్యక్తిత్వాన్ని సాధించుకొంటాడు.** క్రైస్తవాదర్శమే అతనికి సత్యమయింది. క్రీస్తు, అధికారానికి వ్యతిరేకంగా తిరుగబడలేదు. రోమక సామ్రాజ్యాధికారాన్ని శిరసావహించి కప్పం కట్టినాడు. యూదు మతాధికారాన్ని సహించి దాని హింసను ప్రతిహింసతో తిప్పికొట్టలేదు. నేనింతకుముందే చెప్పినట్లు ఆయన దగ్గర సంఘాన్ని పునర్నిర్మించే ప్రణాళిక ఏదీ లేదు. కానీ ఆధునిక ప్రపంచంలో ప్రణాళికలున్నాయి. పేదరికాన్నీ, దానివల్ల కలిగే వేదనలనీ, పారద్రోలుటకివి సంకల్పించినట్టివి. బాధ నుంచి వచ్చే వేదననీ నిర్మూలించవలెననీ వీని ఆశ. సమసమాజం శాస్త్రాల మీద నమ్మకం కల్గి ఉంది. ఆనందం ద్వారా వ్యక్తమయ్యే వ్యక్తిత్వం దీని ఆదర్శం. ఈ నవీన వ్యక్తిత్వం ఇంతకు ముందున్న వ్యక్తిత్వం కంటే గొప్పది, పరిపూర్ణమైంది, అందమైంది. పరిపూర్ణతా పరాకాష్టకు, బాధ ఒక పద్ధతికాదు. బాధ తాత్కాలికం. అదొక అసమ్మతి. అది దోషభూయిష్ఠమైనదీ, అనారోగ్యకరమైనట్టీ, అన్యాయమైనట్టీ పరిసరముల సూచిస్తుంది. ఆదోషాన్నీ, ఆరోగ్యాన్నీ, ఆ అన్యాయాన్నీ తొలగించినపుడు దానికి (బాధకు) నిలువ నీడ వుండదు. అదొక మహత్కార్యం. దాదాపు ముగియ వస్తూవుంది. దాని పరిధి అనుదినమూ తగ్గిపోతూంది.


అది మనిషి కందుకుండా పోదు. నిజానికి మనిషి కోరుకొనేది బాధనూ కాదు, ఆనందాన్నీ కాదు. కేవలం జీవితాన్ని, మనిషి కోరేది అధికంగా, నిండుగా, చక్కగా బ్రతుకవలెననియే. ఇతరుల కడ్డంకులు కలుగజేయకుండ, తాను అడ్డంకులు పాలుగాకుండా అలాగు చేయగలిగితే తన కార్యకలాపాలు తనకానందదాయకాలైతే అతడు ఇప్పటికంటే ఎక్కువ స్తిమితంగా, ఆరోగ్యకరంగా, నాగరికంగా ఉండి మరింత తానుగా జీవిస్తాడు. ఆనందం ప్రకృతి పెట్టే పరీక్ష, ప్రకృతి ఆమోదముద్ర, మనిషి ఆనందంగా ఉన్నపుడు తనతోనూ, తన పరిసరములతోనూ సామరస్యంకలిగి ఉంటాడు. సమసమాజం దేన్నైతే కృషి చేస్తున్నదో ఆ నవీన వ్యక్తిత్వం పరిపూర్ణ సామరస్యం. ప్రాచీన గ్రీకులు ఆకాంక్షించిన ఆదర్శమిది. బానిసలను కల్గియుండుట మూలానా, వారిని మేపుచుండిన కారణాన, వారు భావనలో తప్ప దీనిని సాధించలేకపోయినారు. ఇది పునరుజ్జీవనోద్యమం ఆశించినట్టిది. బానిసలను కల్గియుండుట మూలానా, వారిని సన్తుపెట్టుతుండిన కారణాన, అదికళలో తప్ప దీనిని సాధించలేకపోయింది. ఇది సమగ్రంగా ఉంటుంది. దీని ద్వారా ప్రతి మనిషీ ఆత్మ పరిపూర్ణతని సాధిస్తాడు. నవీన వ్యక్తిత్వమే నవీన హెల్లెనిజం.***

(సమాప్తం)

* పందొమ్మిదవ శతాబ్దాంత రష్యా గురించి వైల్డ్ చెబుతున్నాడు.


** పందొమ్మిదవ శతాబ్దంలో రష్యాలో ''నిహిలిజం'' అనే సర్వమూల్య నిరసనవాద ఉద్యమం బయలుదేరింది. హింస ద్వారా సర్వమూల్యాలను నాశనం చేయవలెనని బకునిన్ లాంటి మేధావులూ, శాంతి మార్గాలద్వారా చేయవలెనని క్రోపాట్కిన్ లాంటి మేధావులు ఉద్యమించిరి. నిహిలిజం అనే నామీకరణం ప్రసిద్ధ నవలాకారుడు ఇవాన్ టర్గనెవ్ చేసినట్టిది. వైల్డ్ వర్ణించిన నిహిలిస్టు లాంటి పాత్రను టర్గనెవ్ తన ప్రఖ్యాత నవల ''తండ్రులు కొడుకులు'' లో బజరోవ్‌లో సృష్టించినాడు.

*** హెల్లెనిజం అంటే గ్రీకు సంస్కృతి



తన తండ్రి పొలోనియస్‌ను హామ్లెట్ చంపిన తరవాత పిచ్చిదై ఆత్మహత్యకు పాల్పడ్డ హామ్లెట్ ప్రేయసి, విషాద నాయకి ఒఫీలియా

MISIMI/మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD-191/2003-05



కారాగార విముక్తి